RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక
The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 24 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ బుధవారం 29-04-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి
RNI No. APTEL/2012/53127
విలేకరులు కావలెను
తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
9182328292



నేడు తెలంగాణ టెన్త్ ..

## ఫలితాలు

### ఈసారి వాట్సాప్‌లోనూ రిజల్ట్స్!

- నేడు మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ పదో తరగతి ఫలితాలు
- దాదాపు 5.15 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం వెల్లడి
- ఈ ఏడాది కొత్తగా వాట్సాప్‌లోనూ ఫలితాలు తెలుసుకునే సౌకర్యం
- నిర్ణీత నంబర్‌కు 'హాయ్' అని పంపి రిజల్ట్స్ సులభంగా పొందొచ్చు

2వ పేజీలో...



2వ పేజీలో...

ఇండోనేషియాలో..

## రెండు రైళ్లు ఢీ

### 14మంది మహిళల దుర్మరణం



తిరుచెందూర్ మురుగన్ సన్నిధిలో

## టీవీకె అధినేత విజయ్

### పట్టువస్త్రాలతో సందడి

మదురై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తరుణంలో, తమిళగ వెట్రి కళగం వ్యవస్థాపకుడు, నటుడు విజయ్ ఆధ్యాత్మిక పర్యటన రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. మంగళవారం తెల్లవారుజామునే చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో మదురై చేరుకున్న ఆయన, అక్కడి నుండి రోడ్డు మార్గంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుచెందూర్ మురుగన్ ఆలయానికి చేరుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పట్టు పంచె, పట్టు చొక్కా ధరించిన విజయ్, స్వామివారి 'విశ్వరూప దర్శనం'లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికి స్వామివారి ప్రసాదంతో పాటు వెండి 'వేల్'ను బహుకరించారు. ఏప్రిల్ 23న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియగా, వచ్చే మే 4వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. తన రాజకీయ అరంగేట్రం తర్వాత జరిగిన ఈ తొలి ఎన్నికల్లో పార్టీ విజయం సాధించాలని కోరుకుంటూ ఆయన ఈ పర్యటన చేపట్టినట్లు తెలుస్తోంది.





సిక్కింలో మోదీ

## 'ఫుట్‌బాల్' సందడి

2వ పేజీలో...

- సిక్కిం రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50 ఏళ్లు
- ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిన ప్రధాని
- తన చిన్ని స్నేహితులతో ఫుట్‌బాల్ ఆటను ఎంజాయ్ చేశానన్న ప్రధాని



2వ పేజీలో...

హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు

## మూడు షరతులు పెట్టిన ఇరాన్

### ససేమిరా అంటున్న అమెరికా

- యుద్ధాన్ని ముగించి, హర్మూజ్‌ను తెరిచేందుకు అమెరికాకు టెహ్రాన్ కొత్త ప్రతిపాదన
- నౌకా దిగ్బంధనం ఎత్తివేత, అణు చర్చల వాయిదా ప్రధాన డిమాండ్లు
- అణు చర్చల వాయిదాను వ్యతిరేకిస్తున్న ట్రంప్, ప్రతిపాదనపై అసంతృప్తి
- హర్మూజ్ మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడి

## రూ. 4 వేల కోట్లతో అభివృద్ధి ప్రాజెక్టుల జాతర!



2వ పేజీలో...

- ఫ్యూచర్ సిటీలో సీపీ భవనానికి సీఎం రేవంత్ శంకుస్థాపన
- ప్రపంచస్థాయి నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని హామీ
- రైతులు భూములిచ్చి సహకరించాలని విజ్ఞప్తి
- ప్రతిపక్షాల మాటలు పట్టించుకోనని వ్యాఖ్య

హైదరాబాద్: ప్రజలను భాగస్వాములను చేస్తూ ఫ్యూచర్ సిటీని అధునాతన నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే సిటీ నిర్మాణం సాధ్యమవుతుందని సీపీ భవన శంకుస్థాపన కార్యక్రమంలో స్పష్టం చేశారు. ఈ నగరం భావితరాలకు వరంగా మారుతుందని పేర్కొన్నారు. అయితే, ఫ్యూచర్ సిటీ నిర్మాణం అంత సులభం కాదని వివరించారు. ఈ సందర్భంగా విపక్ష నేతలపై తనదైన శైలిలో సెటైర్లు వేశారు.

శుక్రాచార్యుడు ఫాంహౌస్ లో

## పడుకున్నాడు

### మారీచుడు, సుబాహుడు జనంలో తిరుగుతున్నారు



చిత్తూరులో దారుణం

## ఏబీఎన్ జర్నలిస్ట్ దారుణ హత్య

- ఉదయం మార్నింగ్ వాక్‌లో ఉండగా కత్తులతో దాడి
- హత్య కేసులో రౌడీ షీటర్ తమీమ్‌ను అనుమానిస్తున్న పోలీసులు
- ఘటనను తీవ్రంగా ఖండించి, నిరసనలకు పిలుపునిచ్చిన జర్నలిస్ట్ సంఘాలు

2వ పేజీలో...



2వ పేజీలో...

భద్రాచలం ఇక

## భద్రమేనా..!

- దక్షిణ అయోధ్య పై ప్రభుత్వానికి ఎందుకు ఇంత చిన్నచూపు..?
- మూడు రాష్ట్రాల సరిహద్దుల ప్రాంతమైన భద్రాచలానికి ఎస్డిపిఓ పోస్ట్ కి "డిమోషన్"..!
- ఇక పోస్టింగ్ కోసం రాజకీయ పైరవీలకు తెర లేచేనా..!?

కొత్తగూడెం, ఏప్రిల్ 28: ఏజెన్సీ జిల్లాగా పేరు ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కీలకమైన భద్రాచలం ప్రాంతానికి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్డీపీఓ) పోస్టుని ఐపీఎస్ అధికారి హోదా నుంచి కుదిస్తూ డీఎస్పీకే పరిమితం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం శోచనీయం. మూడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న భద్రాచలం సబ్ డివిజన్ మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో అక్కడ ఐపీఎస్ అధికారి హోదాను గత ప్రభుత్వాలు కొనసాగిస్తూ వచ్చాయి. ఛత్తీస్‌గఢ్ - తెలంగాణ - ఆంధ్ర సరిహద్దులకు కేంద్రీకృతమై ఉన్న భద్రాచలం ప్రాంతంలో గతంలో డీఎస్పీ స్థాయి అధికారులు పనిచేసినప్పటికీ మావోయిస్టుల ప్రాబల్యం ఉందనే నేపథ్యంలో దాన్ని నిర్మూలించడం కోసమే కాకుండా ఆ ప్రాంతం టెంపుల్ సిటీ కావడంతో అక్కడ ఐపీఎస్ అధికారిని గత ప్రభుత్వాలు నియమిస్తూ వచ్చాయి.

### ఐపీఎస్ పోస్టింగ్ నుంచి డీఎస్పీ రేంజ్‌కు కుదింపు



2వ పేజీలో...

తలసానికి కీలక బాధ్యతలను

## అప్పగించిన కేటీఆర్

హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈరోజు జరిగిన కీలక సమావేశంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలతో కలిసి ఆయన రాబోయే ఎన్నికల వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కు కీలక బాధ్యతలను అప్పగించారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని కేటీఆర్ ఆదేశించారు.

### పార్టీ కీలక నేతలతో భేటీ అయిన కేటీఆర్

# హార్ముజ్ జలసంధిని తెరిచేందుకు మూడు షరతులు పెట్టిన ఇరాన్..



ఢిల్లీ,:అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించుకుని, యుద్ధానికి ముగింపు పలికేందుకు ఇరాన్ ముందుకు వచ్చింది. వ్యూహాత్మకంగా కీలకమైన హార్ముజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని, అయితే అందుకు తమ షరతులను అంగీకరించాలని అమెరికాకు ప్రతిపాదించింది. ఈ మేరకుఒమన్, పాకిస్థాన్ వంటి మధ్యవర్తుల ద్వారా టెహ్రాన్ తన ప్రణాళికను పంపింది. అయితే, ఇరాన్ పెట్టిన షరతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

ఇరాన్ ప్రతిపాదన ఏంటి?: ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి మధ్యవర్తిత్వ దేశాల ద్వారా అమెరికాకు మూడు షరతులతో కూడిన ప్రతిపాదనను పంపారు. వాటిలో ముఖ్యమైనవి: ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన నౌకా దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేయాలి, ఇరాన్ అణు కార్యక్రమంపై జరగాల్సిన చర్చలను వాయిదా వేయాలి. ఈ రెండుప్రధాన షరతులకు అంగీకరిస్తేహార్మూజ్ జలసంధిని వాణిజ్యానికి తెరిచి, యుద్ధ వాతావరణానికి తెరదించుతామని ఇరాన్ తెలిపింది.

అమెరికా ఎందుకు వ్యతిరేకిస్తోంది?: ఇరాన్ అణ్వాయుధాలను

మొదటిపేజీ తరువాయి...

సొంతం చేసుకోకుండా నిరోధించడమే తన ప్రధాన లక్ష్యమని ట్రంప్ మొదటి నుంచి స్పష్టం చేస్తున్నారు. ఈ కారణంతోనే ఆయన యుద్ధానికి దిగారు. ఇప్పుడు ఇరాన్ ప్రతిపాదనలో అణు చర్చలను వాయిదా వేయాలన్న నిబంధన ఉండటమే ట్రంప్ అసంతృప్తికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీనిపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా స్పందించారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని మినహాయించి ఎలాంటి ఒప్పందాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. "ఏ ఒప్పందం జరిగినా, అది ఇరాన్‌ను అణ్వాయుధం వైపు వెళ్లకుండా కచ్చితంగా నిరోధించేలా ఉండాలి" అని ఆయన ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో అన్నారు.

ప్రపంచంపై తీవ్ర ప్రభావం: ప్రస్తుతం ఇరు దేశాల మధ్య తాత్కాలిక కాల్పులవిరమణ అమల్లో ఉంది.అయితే, ప్రపంచ వాణిజ్యంలో ఐదో వంతు చమురు, గ్యాస్ రవాణా అయ్యే హార్ముజ్ జలసంధి మూసివేత ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ కారణంగా అమెరికాలో మధ్యంతర ఎన్నికలముందు పెట్రోల్,గ్యాస్ధరలు ఆకాశాన్నంటాయి. ఇది ట్రంప్‌పై రాజకీయ ఒత్తిడిని పెంచుతోంది. మరోవైపు, అమెరికా మిత్రదేశాలైన గల్ఫ్ దేశాలు కూడా తమ ఎగుమతుల కోసం ఇదే మార్గాన్ని ఉపయోగిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఈ దిగ్బంధనంవల్లఎరువులు, ఆహారం,ఇతర నిత్యావసరాల ధరలు ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోవడంతో పలు దేశాల నుంచి ఒత్తిడిపెరుగుతోంది. ప్రస్తుతంచర్చలు కొనసాగుతున్నప్పటికీ, ఇరుపక్షాలు తమ పంతాలు వీడకపోవడంతో ప్రతిష్టంభన కొనసాగుతోంది.

# మెగా జాబ్ మేళాతో నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**3200 ఖాళీల భర్తీ లక్ష్యంగా మెగా జాబ్ మేళా**

**80కి పైగా కంపెనీల భాగస్వామ్యంతో భారీ ఉపాధి వేదిక**

**జాబ్ మేళా నిర్వహణపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సంబంధిత అధికారు లతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**




ఖమ్మం (తెలంగాణ వాణి) ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మెగా జాబ్ మేళాను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశమై మే 4న నిర్వహించనున్న జాబ్ మేళా నిర్వహణపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, అందులో మెగా జాబ్ మేళా ఒక ముఖ్య కార్యక్రమమని పేర్కొన్నారు. జాబ్ మేళా ద్వారా మొత్తం 3200 ఖాళీలను భర్తీ చేయనున్నామని, సుమారు మూడు రెట్లు అంటే 10 వేల మంది యువత హాజరయ్యే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మెగా జాబ్ మేళా నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించి, వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సరైన వేదికను ఎంపిక చేయాలని ఆదేశించారు. యువతను పెద్ద ఎత్తున సమీకరించేలా ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ చానెల్స్, పత్రికలు, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. మెగా జాబ్ మేళాలో 80కి పైగా కంపెనీలు పాల్గొననున్నందున, వేదిక ఎంపికకు ముందు పోలీసు శాఖతో సమన్వయం చేయాలని, ప్రతి జిల్లాఅధికారి తనకు కేటాయించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వేదిక విశాలంగా ఉండి, వేచి ఉండే ప్రదేశం, కూర్చునే సదుపాయాలు, కంపెనీల స్టాల్స్ ఏర్పాటు చేసుకునే స్థలం ఉండాలని, ప్రజలకు సులభంగా చేరుకునే విధంగా ఉండాలని తెలిపారు. తాగునీరు, ఈవెంట్ కోఆర్డినేటర్లు, దిశా నిర్దేశక బోర్డులు, సైన్ బోర్డులు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మెగా జాబ్ మేళా వేదికలో హై స్పీడ్ ఇంటర్నెట్, సాంకేతిక సిబ్బంది, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు వంటి ఐటీ మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉండాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, సరిపడా పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామం, పట్టణంలో వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలని, క్యూఆర్ కోడ్ ద్వారా కంపెనీల వివరాలు, ఖాళీల సంఖ్య, అర్హతలు వంటి పూర్తి సమాచారం అందుబాటులో ఉంచాలని తెలిపారు. టాస్క్ ద్వారా 80కి పైగా కంపెనీలు ఉదయం సమయానికే వేదికకు చేరుకునేలా చూడాలని, వారికి నగరంలో వసతి వంటి సదుపాయాలు సమకూర్చాలని సూచించారు.

అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ మెగా జాబ్ మేళా నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని సూచించారు. అభ్యర్థుల నమోదు, ఇంటర్వ్యూల నిర్వహణ, కంపెనీల సమన్వయం, యువత సమీకరణ వంటి అంశాల్లో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని తెలిపారు. ప్రతి శాఖ సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డివైఎస్ఓ సునీల్,ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ డబ్ల్యు.జె. ప్రవీణ్ కుమార్, జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి, అసిస్టెంట్ డైరెక్టర్ ఇండస్ట్రీస్ ఈ. నకుల్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణుమాధవ్, ఈడీఎం దుర్గ ప్రసాద్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శుక్రాచార్యుడు ఫాంహౌస్ లో పడుకున్నాడు..

మొదటిపేజీ తరువాయి...

కొంత మంది ఫ్యూచర్ సిటీ నిర్మాణం విషయంలో తనను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని రేవంత్ అన్నారు. "మీరు ఏడుస్తూనే ఉండండి.. నేను చేసుకుంటూ పోతూనే ఉంటా" అంటూ తనదైన శైలిలో ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. శుక్రాచార్యుడు ఫాంహౌస్ లో పడుకున్నారని, మారీచుడు, సుబాహుడు జనంలో తిరుగుతున్నారంటూ బీఆర్ఎస్ అగ్రనేతలను ఉద్దేశించి అన్నారు. టోక్యో, సియోల్, సింగపూర్ వంటి ప్రపంచ స్థాయి నగరాలతో పోటీ పడేలా ఫ్యూచర్ సిటీని నిర్మించడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ దిశగా రోడ్లు సహా అన్ని మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా జూన్ 2లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు రాష్ట్రానికే తలమానికం అని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ సేవలు ప్రపంచవ్యాప్తంగా అందాయని తెలిపారు. ఐటీ, డిఫెన్స్, ఫార్మా ఎగుమతుల్లో నగరం చాలా అభివృద్ధి చెందిందన్నారు. రానున్న రోజుల్లో భాగ్యనగరానికి మరిన్ని పెట్టుబడులు రానున్నాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ కోసం రైతులు భూములిచ్చి సహకరించాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. అందరికీ కచ్చితంగా పరిహారం అందిస్తామన్నారు. అధికారులు వారికి వివరించి నచ్చజెప్పాలన్నారు. అప్పుడే ప్రపంచస్థాయి నగరానికి పునాదులు పడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పూర్తయితే హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 70-80 కి.మీ దూరం తగ్గుతుందన్నారు. కేంద్రం తీసుకురానున్న ఏడు హైస్పీడ్ రైళ్లలో మూడు రాష్ట్రం నుంచి వెళుతున్నాయని సీఎం తెలిపారు. బెంగళూరు నుంచి హైదరాబాద్, శంషాబాద్ నుంచి ముంబై, శంషాబాద్ నుంచి చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయని పేర్కొన్నారు.

# ప్రపంచానికి సవాల్‌గా మారిన ఉగ్రవాదం

**ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశాలను తిప్పికొట్టాలి**

**షాంఘై సహకార రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్**

న్యూఢిల్లీ, : ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు.ఉగ్రవాదం పై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కిర్గిస్థాన్ లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత ఏడాది జమ్ముకశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి గురించి రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. పహల్గామ్ ఉగ్రదాడి ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆ దాడి అనంతరం 'ఆపరేషన్ సింధూర్ చేపట్టి ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందని తెలిపారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్రదాడులను అస్సలు విస్మరించకూడదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని అన్నారు. ఉగ్రవాదులకు సాయపడుతూ ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీవో వెనకాడకూడదని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం గురించి కూడా ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జరిగిన వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూడా వాటిల్లిందని చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ క్రమంలో ఉద్రిక్తతల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలన్నారు.

# భద్రాచలం ఇక భద్రమేనా..!

మొదటిపేజీ తరువాయి...

అయితే ప్రస్తుతం మావోయిజం పూర్తిగా నిర్మూలించబడింది అనే సాకుతో ఆ ప్రాంతాన్ని డీఎస్పీ హోదాకే పరిమితం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల విమర్శలు వస్తున్నాయి. మూడు రాష్ట్రాల సరిహద్దుకి మాత్రమే కాకుండా భద్రగిరిపై కొలువైయున్న రాములవారి ఆలయంతో టెంపుల్ సిటీగా పేరుపొందిన ఐటీడీఏ కారిడార్ కు డీఎస్పీ స్థాయి అధికారిని నియమించడం వల్ల ఇక రాజకీయ పైరవీలకు తెరలేపినట్లు అవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే డీఎస్పీ నుంచి కింది స్థాయి అధికారులకు పోస్టింగ్ కావాలంటే ఎమ్మెల్యే "కన్సంట్" లెటర్ అవసరం ఉందనే విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ పోస్టింగ్ డీఎస్పీకి పరిమితం చేయడం వల్ల ఇక రాజకీయ జోక్యంతో గంజాయి, అక్రమ ఇసుక వంటి అక్రమ రవాణాలకు తెరతీసినట్లు అవుతుందని, శాంతిభద్రతల సమస్యలు సైతం పునరావృతం అవుతాయని పలువురు భావిస్తున్నారు. అంతే కాకుండా దక్షిణ అయోధ్యగా పేరు ఉన్న భద్రాచలానికి డీఎస్పీ స్థాయి అధికారిని నియమించడం పట్ల ఆ ప్రాంతంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిన్నచూపు అవగతం అవుతుంది. భద్రాచలం




ప్రాంతానికి ఐపీఎస్ స్థాయి అధికారినే ఎస్డీపీఓగా నియమించాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు. జిల్లాలో అతిపెద్ద సబ్ డివిజన్ గా ఉన్నటువంటి భద్రాచలం ప్రాంతం పర్యాటక ప్రాంతం కావడంతో నిత్యం అక్కడ వేల సంఖ్యలో భక్తులు, పర్యాటకులు, రవాణాల సౌకర్యాలకు అదుపు చేయాలంటే ఐపీఎస్ స్థాయి అధికారి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇక్కడ ఎస్డీపీఓ స్థానంలో తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకొని ఐపీఎస్ అధికారిని కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

# నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు..



హైదరాబాద్: తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభవార్త. రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు నేడు (బుధవారం) విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు విద్యాశాఖ అధికారులు ఈ ఫలితాలను అధికారికంగా వెల్లడించనున్నారు. ఫలితాల విడుదలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ ఏడాది మార్చి 14వ తేదీ నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఏప్రిల్ 23వ తేదీ నాటికే జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియను అధికారులు పూర్తి

మొదటిపేజీ తరువాయి...

చేశారు. వాస్తవానికి మే మొదటి వారంలో ఫలితాలు ప్రకటించాలని తొలుత భావించినప్పటికీ, ఆ గడువు కంటే ముందే ఫలితాలను విడుదల చేస్తుండటం గమనార్హం.

వాట్సాప్‌లో సులభంగా ఫలితాలు: ఈ విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ ఎస్సెస్సీ బోర్డు ఒక వినూత్న సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు తమ ఫలితాలను సులభంగా వాట్సాప్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ఇప్పటికే హాల్‌టికెట్లను వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించిన బోర్డు, ఇప్పుడు అదే తరహాలో ఫలితాలను అందించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే వాట్సాప్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థుల మొబైల్ నంబర్‌కు ఫలితాల మెమో ఆటోమేటిక్‌గా వస్తుంది. ఒకవేళ ఆ సదుపాయం వినియోగించుకోని వారు, తమ ఫలితాలను తెలుసుకోవాలంటే.. 80969 58096 అనే వాట్సాప్ నంబర్‌కు 'ఎ' అని సందేశం పంపించాలి. ఆ తర్వాత SSC Results అని టైప్ చేసి, హాల్‌టికెట్ నంబర్ వంటి వివరాలు నమోదు చేస్తే, ఫలితం వారి ఫోన్ స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతుంది. ఈ కొత్త విధానం ద్వారా విద్యార్థులు సర్వర్ల రద్దీ సమస్య లేకుండా తమ ఫలితాలను వేగంగా తెలుసుకునేందుకు వీలు కలుగుతుంది.

# ఏబీఎన్ జర్నలిస్ట్ దారుణ హత్య

మొదటిపేజీ తరువాయి...

చిత్తూరు: ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి మీడియా సంస్థలో పనిచేస్తున్న జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డిని గుర్తుతెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. వి. కోట పట్టణంలో ఉదయం ఈ సంఘటన జరిగింది. వివరాల ప్రకారం, జగన్మోహన్ రెడ్డి రోజూలాగే ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆయనపై కత్తులతో దాడి చేసి, అక్కడికక్కడే హత్య చేసి పరారయ్యారు.

ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ఈ హత్య కేసులో వి. కోటకు చెందిన రౌడీ షీటర్ తమీమ్‌ను పోలీసులు ప్రధాన నిందితుడిగా గుర్తించారు. ప్రస్తుతం నిందితుడు పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో నివసిస్తున్నట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ హత్యను ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండించాయి. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. హత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీ

మొదటిపేజీ తరువాయి...




జకార్తాన్యూఢిల్లీ,ఏప్రిల్28 : ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 14 మంది మృతిచెందగా, 84 మంది గాయపడ్డారు. దేశ రాజధాని జకార్తా శివారులో ఉన్న బెకాసి వద్ద ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని రైల్వే అధికారులు చెప్పారు. ఓ కమ్యూటర్ ట్రైన్‌తో పాటు లాంగ్ డిస్టాన్స్ రైలు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరుకున్నట్లు ఇండోనేషియా రైల్వే శాఖ అధికారులు తెలిపారు. గాలింపు పక్రియ ముగిసినట్లు రెస్క్యూ ఏజెన్సీ అధికారులు తెలిపారు. రైల్వే బోగీలు నుజ్జు నుజ్జు అయ్యాయని, వాటిల్లో చిక్కుకున్న వారిని తొలగించడం పెద్ద సమస్యగా మారిందన్నారు. రైలుకు చెందిన మహిళా బోగీ దెబ్బతిన్నదని, బాధితుల్లో అందరూ మహిళలే ఉన్నట్లు అధికారులు తెలిపారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు ఇనుపకడ్డీలను గ్రైండర్లతో కట్ చేశారు. స్థానికంగా తిరిగే లోకల్ కమ్యూటర్ రైలు తొలుత ఓ ట్యాక్సీ ఢీకొన్నదని, ఆ తర్వాత అది మళ్లీ దూరం వెళ్లే మరో రైలును ఢీకొన్నట్లు బాబీ తెలిపారు.

# సిక్కింలో మోదీ 'ఫుట్‌బాల్' సందడి

మొదటిపేజీ తరువాయి...

సిక్కిం: సిక్కిం రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ గ్యాంగ్‌టక్ వెళ్లారు. తన పర్యటన సందర్భంగా, ఈ ఉదయం పాల్జోర్ స్టేడియంలో యువతీయువకులతో కలిసి ప్రధాని ఫుట్‌బాల్ ఆడారు. ఎంతో బిజీగా ఉండే ప్రధాని... కాసేపు యువతతో కలిసి ఆటను ఎంజాయ్ చేశారు. ఈ సందర్భంగా తన సంతోషాన్ని ఎక్స్ వేదికగా ఆయన పంచుకున్నారు.

"నా చిన్ని స్నేహితులతో ఫుట్‌బాల్ ఆడటం చాలా సరదాగా, ఉత్తేజంగా అనిపించింది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా విద్య, వైద్య, మౌలిక సదుపా యాల రంగాలకు సంబంధించి రూ. 4 వేల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సిక్కిం యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్, హెలెన్ లెప్చా మెడికల్ కాలేజ్ ప్రారంభోత్సవం వంటివి ఇందులో కీలకం. ఈ పర్యటనలో భాగంగా ఈశాన్య రాష్ట్రాల కోసం 6 క్రికెట్ అకాడమీలను కూడా ప్రధాని ప్రకటించారు.

# తలసానికి కీలక బాధ్యతలను అప్పగించిన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

ముఖ్యంగా గత ఎన్నికల్లో జుబ్లీహిల్స్ వంటి చోట్ల జరిగిన పరిణామాలను గుర్తు చేస్తూ, ప్రత్యర్థి పార్టీలు నమోదు చేయించే దొంగ ఓట్లు, డబుల్ ఓట్లను గుర్తించి... వాటిని తొలగించేలా పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. నగరంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడటం, కొత్త ఓటర్ల నమోదులో కార్యకర్తలు చొరవ చూపడంపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ మొత్తం కార్యక్రమానికి పర్యవేక్షకుడిగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కేటీఆర్ నియమించారు. ఈ బాధ్యతలపై తలసాని మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గంలో బూత్ లెవల్ అసిస్టెంట్లను తక్షణమే నియమించాలని కోరారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలు జరగకుండా బూత్ స్థాయి నుంచే కాపలా కాయాలని స్పష్టం చేశారు. నగర రాజకీయాల్లో ఓటర్ల జాబితాయే గెలుపోటములను నిర్ణయిస్తుందని, అందుకే దీనిపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని ఆయన పార్టీ నేతలకు సూచించారు.

# తిరుచెందూర్ మురుగన్ సన్నిధిలో టివికె అధినేత విజయ్..

మొదటిపేజీ తరువాయి...

విజయ్ రాకతో ఆలయ ప్రాంగణం మరియు మదురై విమానాశ్రయం వద్ద అభిమానులు భారీగా తరలివచ్చి కోలాహలం సృష్టించారు. కాగా, రాజకీయ బిజీలో ఉన్న విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' కూడా మే 8న విడుదలకు కాబోతుందని వార్తలు వస్తుండటంతో అటు రాజకీయాల్లో, ఇటు సినిమాల్లో విజయ్ తదుపరి అడుగుల కోసం యావత్ తమిళనాడు ఎదురుచూస్తోంది.

# సంపాదకీయం

## రాజకీయ ప్రత్యర్ధులుగా ఆడపడుచులు

సాధారణంగా రాజకీయ పార్టీలు వేర్వేరు మార్గాల్లో వెళ్తుంటాయి. సిద్ధాంతాలతో పాటు భావజాలం వేరువేరుగా ఉంటుంది. అంతిమంగా ప్రజలకు మేలు చేయడమే కానీ.. వెళ్లే మార్గాలు వేర్వేరుగా ఉంటాయి. కానీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన విపక్షాలుగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పార్టీలు ఒకే సారూప్యతతో ముందుకు వెళ్లడం విశేషం. చాలా అంశాల్లో ఆ రెండు పార్టీలు ఒకే విధానంతో ముందుకు వెళ్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఒకే రకమైన వ్యవహార శైలి.. ఒకే రకమైన భావజాలం రెండు పార్టీల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది.అలా జరుగుతుందా కేసీఆర్, జగన్ నేతలూ మూడో ఫ్రంట్ కడతారా. దేశ రాజకీయాల్లో కీలకమైన మలుపు తిప్పుతారా ఇవన్నీ ప్రశ్నలే. ఇంకా చెప్పాలీ అంటే ఊహాగానాలే కూడా. ఎందుకంటే ఈ ఇద్దరూ రాజకీయంగా మంచి స్నేహితులు అని ప్రచారంలో ఉన్నా ప్రస్తుతం ఇద్దరి రాజకీయాలూ కొంత ప్రతికూల వాతావరణంలో సాగుతున్నాయి. ఇద్దరూ మాజీ సీఎంలు అయ్యారు. ఇద్దరూ విపక్షంలోకి వచ్చేసారు. రెండు చోట్లా బలమైన ముఖ్యమంత్రులతో పోరాటం చేయాల్సి వస్తోంది. దానికి తోడు ఇద్దరి రాజకీయ ప్రత్యర్ధులు వేరుగా ఉన్నారు. ఏపీలో టీడీపీతో జగన్ ఫైట్ చేస్తున్నారు. అవతల కాంగ్రెస్ తో కేసీఆర్ రాజకీయ యుద్ధం చేస్తున్నారు. అంతే కాదు జగన్ బీజేపీ పట్ల సాఫ్ట్ కార్నర్ తో ఉంటున్నారు. కేసీఆర్ కి తెలంగాణాలో బీజేపీ కూడా ఒక రాజకీయ ప్రత్యర్ధి గానే ఉంది అన్నది రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు ఇదిలా ఉంటే కేంద్రంలోని బీజేపీ నాయకత్వం లో నడిచే ఎన్డీయే ప్రభుత్వం ఏ బిల్లు ప్రవేశపెట్టినా జగన్ పార్టీ వైసీపీ మద్దతు ఇస్తోంది. తాజాగా డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది అంతా కూడా తమకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని గగ్గోలు పెడుతున్న వేళ జగన్ మద్దతు ఇచ్చారు. అక్కడితో ఆగకుండా ఆయన జాతీయ స్థాయిలో విపక్షాల తీరుని గట్టిగా విమర్శించారు. బీజేపీకి మద్దతుగా మాట్లాడారు. ఇదే మరింతగా న్యూట్రల్ రాజకీయ వర్గాలకు సైతం ఆగ్రహం కలిగేలా చేసింది అని అంటున్నారు. జగన్ బీజేపీకి సరెండర్ అయిపోయారు అంటూ కాంగ్రెస్ సహా ఇతర పార్టీల నుంచి విమర్శలు వచ్చిపడ్డాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కి అత్యంత సన్నిహితుడు జగన్ వైసీపీని పెట్టిన తొలి నాళ్ళలో ఆయనతో కలిసి పనిచేసిన మాజీ ఎమ్మెల్యే సీనియర్ నాయకుడు గోనే ప్రకాశరావు అయితే జగన్ తీరుని పూర్తిగా తప్పుపట్టారు. జగన్ ఉంటే ఎన్డీయేలో ఉండాలి లేకపోతే ఇండియా కూటమిలో ఉండాలి. అటూ ఇటూ కాకుండా ఏమిటీ రాజకీయ వైఖరి అంటూ గోనె దుయ్యబెట్టారు. కాంగ్రెస్ కి మద్దతు ఇవ్వడం ఇష్టం లేకపోతే కేసీఆర్ తో కలసి జగన్ మూడో ఫ్రంట్ ఏర్పాటు చేసుకోవచ్చు కదా అని కీలక సలహా కూడా ఇచ్చారు. మీ ఇద్దరూ మిత్రులే కదా అని కూడా అన్నారు. ఈ విధంగా బయట ఉంటూ ఎన్డీయేకు మద్దతు ఇవ్వడమేంటని ఎకసెక్కమాడారు. స్టూడెంట్స్‌పై వేధింపుల ఆరోపణలు నిజమేగోనె ప్రకాశరావు ఇచ్చిన సలహా బాగానే ఉన్నా అది కుదిరే పనేనా అని అంటున్నారు. కేసీఆర్ సీఎం గా ఉన్నపుడు బీఆర్ఎస్ పేరుతో ప్రయోగాలు చేసిందే మూడో ఫ్రంట్ కోసం. కానీ అసలుకే ఎసరు వచ్చింది.. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఎప్పుడు ఫామ్ హౌస్ కే పరిమితం అవుతున్నారు. ఆయన ప్రజల్లోకి వచ్చింది చాలా తక్కువ. అలాగని అసెంబ్లీకి వెళ్ళరు. టైగర్ కు టైం వచ్చింది అంటూ పార్టీ శ్రేణులు గర్వంగా చెబుతుంటాయి. కానీ ఆయన ప్రజల్లోకి వచ్చింది లేదు. ఏపీలో జగన్మోహన్ రెడ్డి తీరు సైతం అలానే ఉంటుంది. ఆయన ప్యాలెస్ ల చుట్టూ తిరుగుతుంటారు. వారంలో నాలుగు రోజులపాటు బెంగళూరు ఎలాహంక ప్యాలెస్ లో ఉంటారు. మూడు రోజులు తాడేపల్లి ప్యాలెస్ లో గడుపుతారు. ఇప్పుడు హైదరాబాద్ ప్యాలెస్ కి వెళ్తానంటున్నారు. ఈయన సైతం అసెంబ్లీకి హాజరు కావడం లేదు. ప్రజల మధ్యకు వచ్చే సాహసం చేయడం లేదు. అయినా సరే వచ్చే ఎన్నికల్లో తమదే అధికారం అని ఈ ఇద్దరు నేతలు చెబుతున్నారు.ఎన్డీఏ ప్రభుత్వం విషయంలో సైతం వీరు సానుకూలంగానే ఉంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అయితే కెసిఆర్ ప్రధాని నరేంద్ర మోడీని టార్గెట్ చేసుకుంటూ మాట్లాడేవారు. వ్యక్తిగత విమర్శలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ కేంద్రానికి చిన్న విమర్శ కూడా చేయడం లేదు. జగన్మోహన్ రెడ్డి తీరు గురించి చెప్పనవసరం లేదు. విమర్శలు చేయలేదు సరి కదా.. తిరిగి వ్యతిరేక కూటమికి మద్దతు తెలుపుతున్నారు. అప్పట్లో ప్రత్యేక హోదా విషయంలో చిన్నపాటి విమర్శలు కూడా చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేదు. రెండు పార్టీలకు ఆడపడుచుల బెడద తప్పడం లేదు. ఏపీలో సోదరుడు జగన్మోహన్ రెడ్డిని విభేదిస్తున్నారు షర్మిల. రాజకీయ ప్రత్యర్థులుగా మారిపోయారు. తెలంగాణలో సోదరుడు కేటీఆర్ తో పాటు తండ్రిని వ్యతిరేకిస్తున్నారు కవిత. ఘాటైన విమర్శలు చేస్తూ సొంత పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు చేసుకుంటున్నారు కవిత. అయితే ఈ ఇద్దరు ఆడబిడ్డలకు సోదరుల కాలకేయ సోషల్ మీడియా సైన్యం చుక్కలు చూపిస్తోంది. మరోవైపు ఏపీలో జగన్మోహన్ రెడ్డి, తెలంగాణలో కేటీఆర్ పాదయాత్రలకు సిద్ధపడుతున్నారు. వారికి పోటీగా చెల్లెలు సైతం పాదయాత్ర దిశగా ఆలోచనలు చేస్తున్నారట. మరోవైపు జగన్మోహన్ రెడ్డి బయటకు వస్తే ఎలివేషన్లు మామూలుగా ఉండవు. చిన్నపిల్లల సీన్ క్రియేట్ చేస్తారు. జగన్ మామయ్య అంటూ గుక్క తిప్పి ఏడుస్తారు. అయితే ఈ ఎలివేషన్లు వెనుక ఐప్యాక్ హస్తం ఉంటుంది. అటువంటిదే ఇటీవల తెలంగాణలో కెసిఆర్ కూడా చేసి చూపించారు. జగిత్యాల సభకు వెళ్తున్న క్రమంలో ఓ తండ్రి చెంతనే ఉన్న పిల్లకు ఫ్లయింగ్ కిస్ ఇచ్చి ఆశ్చర్యపరిచారు. అదంతా ఎలివేషన్లలో భాగమేనని తెలుస్తోంది. ఇలా ఆ రెండు పార్టీల భావసారుప్యత ప్రతి దాంట్లోనూ కనిపిస్తోంది.ఇపుడు తెలంగాణాలో అధికారం దక్కించుకోవడమే కేసీఆర్ ప్రధాన లక్ష్యం. జగన్ విషయం చూస్తే ఆయన ఏపీ గడప దాటి బయట రాజకీయాలు చేసేందుకు అసలు ఇష్టపడరు. కేవలం ఆంధ్రాకే పరిమితం అవుతూ వస్తున్నారు. పైగా బీజేపీ పట్ల సానుకూలంగా ఉంటూ వస్తున్నారు. దానికి కారణం ఎవరికీ తెలియదు కానీ కాంగ్రెస్ వ్యతిరేకత అని అంటున్నారు. ఇక 2029 లో దేశంలో రెండే కూటములు పోటీ పడే సీన్ ఉంది. అవి ఎన్డీయే ఇండియా కూటములు. జగన్ కి ఇండియా కూటమి బహు దూరం. అందులో కాంగ్రెస్ ఉంది కాబట్టి చేరే ప్రసక్తి లేదు. అలాగని ఎన్డీయేలో చేరాలీ అంటే అందులో ఇప్పటికే చంద్రబాబు పవన్ ఉన్నారు. పైగా తనకు ఉన్న మైనారిటీ ఓట్లు పోతాయని జగన్ బాహాటంగా పొత్తు పెట్టుకోరు. అలాగని బీజేపీకి కాంగ్రెస్ కి సమ దూరం పాటించేది కూడా లేదని అంటున్నారు. మొత్తం మీద జాతీయ స్థాయిలో వైసీపీది ఒక నిలకడ లేని రాజకీయం అని ప్రత్యర్ధులు విమర్శిస్తున్నా వైసీపీ అధినాయకత్వం మాత్రం తన రూటే సెపరేట్ అంటోంది. సో మూడో ఫ్రంట్ ముచ్చట అయితే జగన్ కేసీఆర్ లు చేసేది ఉండదనే అంటున్నారు. ఒకవేళ బీజేపీ ఓటమి చెంది కేంద్ర రాజకీయాల్లో మూడవ కూటమిగా ఎవరైనా ముందుకు వస్తే అందులో వైసీపీ కీలకంగా వ్యవహరించవచ్చు అని అంటున్నారు. అలాంటి కూటమికి కేసీఆర్ మద్దతు కూడా ఉండే చాన్స్ ఉందని అంటున్నారు.

## ఎయిర్‌టెల్ సిమ్ తీసుకుంటే..

## లీటర్ పెట్రోల్ ఫ్రీ..

## దమ్మపేటలో వినూత్న ఆఫర్




భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ కొరత నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్‌టెల్ ప్రతినిధులు వినూత్న ఆఫర్ ఇచ్చారు. తమ దగ్గర సిమ్ తీసుకుంటే లీటర్ పెట్రోల్ ఇస్తామని బంపరాఫర్ ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లో కృత్రిమ ఇంధన కొరతతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బంక్‌ల వద్ద నో స్టాక్ బోర్డులు పెడుతుండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తెరచివున్న బంక్‌ల వద్ద క్యూ కట్టి మరీ పెట్రోల్ పట్టించుకుంటున్నారు. ఈ క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో ఎయిర్‌టెల్ ప్రతినిధులు రంగంలోకి దిగారు. ఈ సంక్షోభాన్ని క్యాష్ చేసుకుంటూ.. మా దగ్గర సిమ్ తీసుకుంటే చాలు.. లీటర్ పెట్రల్ ఫ్రీగా ఇస్తామని బంపరాఫర్ ప్రకటించారు. కొత్త కనెక్షన్ అయినా సరే.. లేదా వేరే నెట్‌వర్క్ నుంచి ఎయిర్‌టెల్‌కు మారినా సరే.. రూ.350 రీచార్జ్‌తో పాటు ఒక లీటర్ పెట్రోల్‌ను ఉచితంగా ఇస్తున్నారు. కస్టమర్లను పెంచుకునేందుకు ఎయిర్‌టెల్ ప్రతినిధులు ఫాలో అవుతున్న ట్రిక్ ఇప్పుడు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటుంది.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



హైదరాబాద్, : డాలర్ కాస్త బలపడడం, గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం వంటి కారణాలతో మంగళవారం బంగారం ధర తగ్గుదల నమోదు చేసింది. భౌగోళిక, అంతర్జాతీయ రాజకీయ కారణాలతో కాస్త హెచ్చుతగ్గులకు లోనవుతోంది. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గుదల నమోదు చేసింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,000 గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,250గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.650 మేర తగ్గింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,150గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధరరూ.1,40,400గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. కిలోకు 4 వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండిధర రూ.2.6 లక్షలుగాఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2.65లక్షలుగా, బెంగళూరులో రూ.2.60లక్షలుగా ఉంది.

## అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్లు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల (తెలంగాణ వాణి): అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్లు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ లో గల రెండు పడక గదుల ఇండ్లను అధికారులతో కలిసి పరిశీలించారు ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు గూడు కనిపించే ఉద్దేశంతో చేపట్టిన రెండు పడక గదుల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణంలో ఉన్న పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారుఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లింగంపల్లి ఖుర్ద్ బ్రిడ్జ్, అడ్విలింగాల్ బ్రిడ్జ నిర్మాణానికి నిధులు మంజూరు



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి): ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్ మరో కీలక అడుగు వేశారు. హైదరాబాద్‌లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్కని మర్యాదపూర్వకంగా కలుసుకుని, నియోజకవర్గంలోని అత్యవసర సమస్యలపై చర్చించారు. ఇటీవల వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న లింగంపల్లి ఖుర్ద్ బ్రిడ్జ్, అడ్విలింగాల్ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి తక్షణ నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ రెండు వంతెనలు పునర్నిర్మాణం అయితే రైతులకు మరియు సాధారణ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి, రోజువారీ కార్యకలాపాలు సులభతరం అవుతాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఇటీవల వరద ప్రభావిత ప్రాంతాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సందర్శించిన విషయాన్ని గుర్తుచేస్తూ, సమస్య తీవ్రతను ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అదేవిధంగా, నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి కావడానికి కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను సమయానికి విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ అంశాలపై ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పట్ల ఎమ్మెల్యే మదన్ మోహన్ కృషి నిరంతరం కొనసాగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. డిప్యూటీ భట్టి విక్రమార్క ఈ అంశాలపై సానుకూలంగా స్పందించి, లింగంపల్లి ఖుర్ద్ బ్రిడ్జ్, అడ్విలింగాల్ వంతెన మంజూరు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## జిల్లాలో ఇంధన సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి: జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి) జిల్లాలో పెట్రోల్, డీజిల్ వంటి ఇంధన సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన జిల్లావ్యాప్తంగా ఇంధన సరఫరా, ధాన్యం కొనుగోలు, ఎస్ఐఆర్ మ్యాపింగ్ అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడా ఇంధన కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వ్యవసాయ కార్యకలాపాలు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన ఇంధనం అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. తహసీల్దారులు క్షేత్రస్థాయిలో పెట్రోల్ బంకులను సందర్శిస్తూ స్టాక్, ఇండెంట్ వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని, ఏవైనా లోపాలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కరించాలని ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ బ్లాక్ మార్కెట్ విక్రయాలను అరికట్టాలని, ఎవరైనా బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు చేపడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కూడా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు . మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ధాన్యం సేకరణలో పారదర్శకత పాటిస్తూ తేమ శాతం, బరువు కొలతలు వంటి అంశాల్లో నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తూ మండలాల వారీగా పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని, సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో డేటా ఖచ్చితత్వం, సమగ్రతను నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలను సమర్థవంతంగా అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ప్రతి ఒక్కరూ స్వీయ నమోదు ప్రక్రియ చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్, ఏప్రిల్:28(తెలంగాణ వాణి ప్రతినిధి): జిల్లా ప్రజలు జనగణన-2027లో భాగంగా నిర్వహిస్తున్న స్వీయ నమోదు (Self Enumeration) ప్రక్రియను తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన-2027, సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై పాత్రికేయులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జనగణన దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని, జనాభా గణాంకాల ఆధారంగానే ప్రభుత్వాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ విధానాలను రూపొందిస్తాయని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా పాల్గొని సరైన సమాచారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. జనగణన ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి దశలో “ఇండ్ల జాబితా, ఇండ్ల గణన (HLO)” కార్యక్రమాన్ని చేపట్టి, మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని చెప్పారు. రెండో దశ జనాభా గణనను 2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో ప్రజలకు “సెల్ఫ్ ఎన్యుమరేషన్” సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు https://se.census.gov.in పోర్టల్ ద్వారా ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి కుటుంబ సభ్యుల వివరాలు సహా మొత్తం 33 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు.

నమోదు పూర్తైన అనంతరం లభించే 11 అంకెల SE IDను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వీయ నమోదు పూర్తి చేసిన కుటుంబాలు మే 11 తర్వాత ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు SE ID చూపిస్తే సరిపోతుందని, దీంతో గణన ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సీపీఓ జీవరత్నం, డీపీఆర్వో విష్ణువర్ధన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 13వ,వార్డులో సెట్ బ్యాక్ లేకుండా డ్రైనేజీ నిర్మాణాలు




హుస్నాబాద్ ఏప్రిల్ 28 (తెలంగాణ వాణి ఆర్ సి): కమిషనర్ హుస్నాబాద్ పట్టణంలోని 13వ,లో వార్డు యందు నిర్మిస్తున్న రాజయ్య విగ్రహం నుండి సంపత్ రాజిరెడ్డి వరకు నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను పరిశీలించాలని,భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ అందు గత రెండు సంవత్సరాల క్రితం 13 లో వార్డు రాజయ్య విగ్రహం నుండి సంపత్ రాజిరెడ్డి ఇంటి వరకు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా పనులు చేస్తున్న కూడా వారికి సహకరించిన మున్సిపల్, ఇంజనీరింగ్,అధికారుల, కాంట్రాక్టర్ పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ నుండి డబ్బులు రికవరీ చేయాలని అన్నారు. గతంలో డ్రైనేజీ నిర్మాణం ఇష్టానుసారంగా, నిబంధనలకు వ్యతిరేకంగా సరియైనక్వాలిటీచేయకుండా డ్రైనేజీ నిర్మాణం చేయడం వల్ల అది మూడు రోజుల ముచ్చటగానే మిగిలి పోయిందని, డ్రైనేజీ కి సంబంధించిన సైడ్ వాల్ పడిపోవడం జరిగిందని, అలాగే ఇప్పుడు అదే పనిని నాసిరకంగా చేస్తున్న అధికారుల పర్యవేక్షణ లేదని,సెట్ బ్యాక్ లేదని,కాంట్రాక్టర్ కు ఇంజనీరింగ్ అధికారులు వత్తాసు పలుకుతూ ఇష్టానుసారంగా పనులు జరుగుచున్నవి కాబట్టి ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించాలని గతంలో నాణ్యత నాణ్యత లేకుండా నిర్మాణ పనులు చేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని,డబ్బులు రికవరీ చేయాలని,వారికి సహకరించిన ఏఈ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రామచంద్రస్వామి దేవస్థానంలో ప్రథమ వార్షికోత్సవం

నాంపల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) నల్లగొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానంలో ప్రథమ వార్షికోత్సవం వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి.

ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ, అభిషేకం, ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించగా, ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఈ మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. అదేవిధంగా విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట రఘు నందన్,ఆలంపల్లి ఆనంద్, సంగేపు పరంధాములు, గుర్రం శ్రీరాములు, భరతయ్య, సంగేపు గణేష్, గుర్రం గణేష్, కర్నాటి విజయ్, గోలి కృష్ణ, శిరందాసు లక్ష్మణ్, కర్నాటి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు

## చిత్ర పౌర్ణమి వేళ అరుణాచల గిరి ప్రదక్షిణ

# ఇదే అత్యంత పవిత్ర సమయం!



తిరువణ్ణామలై: తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర ఆలయంలో చిత్ర పౌర్ణమి సందర్భంగా భక్తులు గిరి ప్రదక్షిణ (గిరివలయం) చేయడానికి శుభ ముహూర్తాన్ని ప్రకటించారు. అదే సమయంలో, ఆలయ, జిల్లా యంత్రాంగం భక్తులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తూ, భద్రతా ఏర్పాట్లను చేస్తోంది. ఈరోజున పెద్ద ఎత్తున భక్తులు గిరిప్రదక్షిణ చేసే అవకాశం ఉంది.

ప్రపంచ ప్రసిద్ధి చెందిన శ్రీ అరుణాచలేశ్వర ఆలయం తిరువణ్ణామలైలో ఉంది. ప్రతి నెలో వచ్చే పౌర్ణమి, చిత్ర పౌర్ణమి, కార్తీక దీపం పండుగ, కొండపై మహాదీపం వెలిగించే కార్యక్రమం, ప్రదోషం వంటి ప్రత్యేక రోజులలో పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఆలయాన్ని సందర్శించడం ఆనవాయితీ. స్థానిక భక్తులే కాకుండా, జిల్లా, రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తారు. అందువల్ల, ప్రత్యేక రోజులలో ఆలయాన్ని తెల్లవారుజామున తెరుస్తారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకం, ఆరాధనలు నిర్వహిస్తారు. అంతేకాకుండా, ఆలయం చుట్టూ సుమారు 14 కిలోమీటర్ల మేర ఉన్న గిరివాలం (గిరి ప్రదక్షిణ) మార్గంలో తమ మొక్కులు తీర్చుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు గిరివలయానికి వస్తారు. అరుణాచలేశ్వర ఆలయంలో ఇది ఒక ముఖ్యమైన ఘట్టంగా పరిగణించబడుతుంది.

చిత్ర పౌర్ణమి రోజున ప్రత్యేక అభిషేకం: ఈ నేపథ్యంలో, తమిళనాడులో చిత్తరై మాస పౌర్ణమి మే 1వ తేదీ (శుక్రవారం)న వస్తోంది. ఈరోజున, ఉన్నములై అమ్మన్ శ్రీఅరుణాచలేశ్వర ఆలయాన్ని తెల్లవారుజామున తెరిచి, స్వామివారికి పాలు, పెరుగు, పన్నీర్, పంచామృతం, పవిత్ర జలం, యాలకుల నీరు, తేనె వంటి వివిధ రకాల పదార్థాలతో అభిషేకం చేస్తారు. దీని అనంతరం, స్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరించి, దీపారాధన చేసి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దానికి అనుగుణంగా, ఆ రోజు ఉదయం నుంచి స్వామివారికి వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

తిరువణ్ణామలైలోని గిరివాలం సందర్శించడానికి ఉత్తమ సమయం: ఈ నేపథ్యంలో భక్తులు అరుణాచలేశ్వర ఆలయ గిరివలయం దర్శనం చేసుకోవడానికి ఉత్తమ సమయాన్ని ఆలయ యంత్రాంగం ప్రకటించింది. ఇది ఏప్రిల్ 30 (గురువారం) రాత్రి 9.52 గంటలకు ప్రారంభమై, మరుసటి రోజు మే 1 (శుక్రవారం) రాత్రి 11.08 గంటలకు ముగుస్తుంది. అందువల్ల, భక్తులు ఈ సమయంలో గిరివలయాన్ని సందర్శించవచ్చని తెలియజేయబడింది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి 30 లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా.

భక్తులకు ప్రాథమిక సౌకర్యాలు: ఈ క్రమంలో, ఆలయ యంత్రాంగం భక్తుల కోసం తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ వంటి ప్రాథమిక సౌకర్యాలను కల్పిస్తోంది. అంతేకాకుండా, భక్తుల సౌకర్యార్థం ఒక వైద్య బృందం, అగ్నిమాపక సిబ్బంది, పెద్ద సంఖ్యలో పోలీసు అధికారులు భద్రతా విధుల్లో నిమగ్నమై ఉన్నారు. దీంతో పాటు, జిల్లా యంత్రాంగం కూడా భక్తులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేస్తోంది.

## నాసిక్ టీసీఎస్ కేసులో కొత్త మలుపు..

# నిందితురాలికి మలేషియా లింక్!

- నాసిక్ టీసీఎస్ మత మార్పిడి ఆరోపణల కేసులో కొత్త మలుపు
- దర్యాప్తును మాలేగావ్, మలేషియా వరకు విస్తరించిన సిట్
- ప్రధాన నిందితురాలు నిదా ఖాన్‌పై కీలక ఆధారాలున్నాయన్న ప్రాసిక్యూషన్
- ఉద్యోగినిని మలేషియాకు పంపేందుకు కుట్ర జరిగిందన్న ఆరోపణలు
- నిందితురాలి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ మే 2కి వాయిదా




ఢిల్లీ,: నాసిక్‌లోని టీసీఎస్ కార్యాలయంలో మత మనోభావాలను దెబ్బతీశారని, బలవంతపు మత మార్పిడికి ప్రయత్నించారని నమోదైన కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసు దర్యాప్తు నాసిక్ నగరాన్ని దాటి మాలేగావ్, మలేషియా వరకు విస్తరించిందని, ప్రధాన నిందితురాలు నిదా ఖాన్‌కు వ్యతిరేకంగా తమ వద్ద అదనపు ఆధారాలున్నాయని ప్రాసిక్యూషన్ నాసిక్ కోర్టుకు తెలియజేసింది. ఈ కేసులో మలేషియా ప్రమేయం ఉన్నట్లు 'ఇండియా టుడే' తన కథనంలో మొదటిసారి వెల్లడించింది. నిదా ఖాన్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్ మిశ్రా వాదనలు వినిపించారు. బాధితురాలిని ఇస్లాంలోకి మార్చేందుకు నిదా ఖాన్ ప్రయత్నించారని, ఆమెకు మతపరమైన పద్ధతులు నేర్పించారని ఆరోపించారు. బురఖా ఇవ్వడం, ప్రార్థనలు ఎలా చేయాలో నేర్పించడం, ఫోన్‌లో మత సంబంధిత యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం వంటివి చేశారని కోర్టుకు తెలిపారు. బాధితురాలి పేరును 'హనియా'గా మార్చడానికి కూడా ప్రణాళికలు రచించినట్లు ప్రాసిక్యూషన్ పేర్కొంది. ఈ కుట్రలో భాగంగా సహ నిందితుడు డానిష్ షేక్, బాధితురాలికి చెందిన కీలకమైన డాక్యుమెంట్లను తీసుకున్నాడని, వాటిని మాలేగావ్‌లోని ఒక బృందానికి అప్పగించాల్సి ఉందని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. అనంతరం ఇమ్రాన్ అనే వ్యక్తి ద్వారా ఉద్యోగం పేరుతో బాధితురాలిని మలేషియాకు పంపేందుకు ప్లాన్ చేసినట్లు తెలిపింది. ఈ కుట్ర వెనుక ఆర్థిక సహకారం ఏమైనా ఉందా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని వివరించింది. ప్రస్తుతం నిదా ఖాన్ పరారీలో ఉందని, మరికొంతమందిని లక్ష్యంగా చేసుకున్నారేమో తెలుసుకోవడానికి ఆమె ఫోన్‌ను స్వాధీనం చేసుకోవాల్సి ఉందని మిశ్రా వాదించారు. బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మరోవైపు, నిదా ఖాన్ తరఫు న్యాయవాది రాహుల్ కస్లీవాల్ ఈ ఆరోపణలను ఖండించారు. మహారాష్ట్రలో మత మార్పిడి నిరోధక చట్టం లేదని, అసలు మత మార్పిడి జరగలేదని వాదించారు. ఈ కేసులో తొమ్మిది ఎఫ్ఐఆర్‌లకు బదులుగా ఒకటే నమోదు చేయాలని ఆయన అన్నారు. వాదనలు విన్న న్యాయస్థానం, నిదా ఖాన్‌కు ఎలాంటి రక్షణ కల్పించలేదు. తదుపరి విచారణను మే 2వ తేదీకి వాయిదా వేసింది.

# అలంకారప్రాయంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ఏన్కూర్ : రైతే రాజు, రైతు లేనిదే రాజ్యం లేదు అని మీటింగుల్లో చెప్పుకోవడానికే పరిమితమైందే తప్ప, రైతులకు ఎక్కడా న్యాయం జరగడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధాన్యం కుప్పలు తెప్పలుగా ఉన్నప్పటికీ, ఒక్క బస్తా కూడా ఇప్పటివరకు కొనుగోలు చేసిన దాఖలాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లులకు అలాట్‌మెంట్ లేకుండానే ఎమ్మెల్యే సార్ చేత ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎలా ప్రారంభించారని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఆరుగాలం పండించిన పంట చేతికి వచ్చే సమయంలో అధికారులు తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్ల రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది అని పలువురు రైతులు వాపోతున్నారు. మరోవైపు ప్రైవేట్ వ్యాపారులు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కల్లాలోనే న్యాయంవైన ధరలు ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలించుకుంటుండగా, ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే కొనుగోలు కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితులు ఎందుకు నెలకొన్నాయో రైతులు ప్రశ్నిస్తున్నారు. ధాన్యం చేతికి వచ్చినప్పుడే రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తే పరిస్థితి ఏర్పడిందని, జిల్లాలో సివిల్ సప్లై అధికారులు మిల్లులకు అలాట్‌మెంట్ చేయకుండా ఏమి చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా వర్షాలు పడితే ధాన్యాన్ని కాపాడుకోవడం కష్టతరమవుతుందని, వర్షం నుంచి రక్షించేందుకు సరిపడ టార్పాలిన్ పట్టాలు కూడా అందుబాటులో లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సార్ తమ బాధను ఆలకించి, వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

# అభివృద్ధి సరే... నిర్వహణ సంగతేంటీ

హైదరాబాద్, : నగరంలోని చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి బాధ్యతలను భుజాన వేసుకున్న 'హైడ్రా' కు ఇప్పుడు వాటి నిర్వహణ ఒక సవాలుగా మారింది. ఆక్రమణలను తొలగించి, చెరువులను సుందరీకరించిన తర్వాత వాటిని ఎవరు పర్యవేక్షించాలనే విషయంలో మున్సిపల్ అధికారులు, హైడ్రా మధ్య సందిగ్ధత నెలకొంది. అభివృద్ధి చేసిన తటాకాలను హైడ్రాకే వదిలేస్తూ జీహెచ్ఎంసీ చేతులు దులుపుకుంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చెరువుల చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల బిల్లులు, రోజుకు మూడు షిఫ్టుల్లో పనిచేసే భద్రతా సిబ్బంది జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చులు ఇప్పుడు ప్రధాన సమస్యగా మారాయి.

నిబంధనల ప్రకారం చెరువు కట్టలు, బఫర్ జోన్ల బాధ్యతను మున్సిపల్ అధికారులు, నీటిపారుదల శాఖ ఇంజనీర్లు చూడాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. నిధుల కేటాయింపు నేరుగా లేకపోవడం, హెచ్ఎండీఏ నిధులపైనే ఆధారపడాల్సి రావడంతో హైడ్రా వింత పరిస్థితిని ఎదుర్కొంటోంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారు 20 చెరువుల్లో ఆక్రమణలను తొలగించారు. అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బమ్రుల్ ఉద్దౌలా, కూకట్‌పల్లి నల్లచెరువు వంటి వాటిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రారంభించారు. అయితే, ఈ చెరువులను లోతుగా తవ్వి ట్యాంకుల్లా మార్చడం వల్ల వర్షాకాలంలో వరదను ఇవి ఎంతవరకు తట్టుకోగలవనే సందేహాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. నగరానికి ఆభరణాలుగా మారిన ఈ చెరువుల నిర్వహణ బాధ్యతను స్పష్టంగా ఎవరికి అప్పగించాలనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. అప్పటివరకు ఈ తటాకాల సంరక్షణపై నీలినీడలు కమ్ముకునే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# పొలం దగ్గర వ్యక్తి దారుణ హత్య

మద్దూరు : మండలంలోని ఖాజీపూర్ గ్రామంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, ఖాజీపూర్ గ్రామానికి చెందిన ఎండి అహ్మద్ (37) మంగళవారం ఉదయం తన పొలం దగ్గర విగతజీవిగా పడి ఉన్నాడు. దీనిని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, వారు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి తల పై బండరాయితో కొట్టి హత్య చేసినట్లు గుర్తించారు. ఎవరో పథకం ప్రకారం పొలం దగ్గరికి పిలిపించి చంపి ఉంటారని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు.

# సర్కార్ కంట్రోల్ లోకి మెట్రో..



హైదరాబాద్, : హైదరాబాద్ మెట్రో రైల్ పై తెలంగాణ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంది. ఎల్ అండ్ టీ 100శాతం ఈక్విటీ వాటాలను స్వాధీనం చేసుకుంది. ఈనెల 30 నాటికి15వేల కోట్ల డీల్ పూర్తి చేయాలని నిర్ణయించింది. దీంతో మెట్రో ఇక సర్కార్ పరిధిలోకి వచ్చింది. నగరవాసులు ప్రధాన రవాణ వ్యవస్థ అయిన హైదరాబాద్ మెట్రోపై ఇక పూర్తి అధికారాలు సర్కార్ కే చెందనున్నాయి. మెట్రో నిర్వహణ, యాజమాన్య బదిలీ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం కొత్త బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మెట్రో భవిష్యత్ ప్రణాళికలు, విస్తరణ, నిర్వహణ బాధ్యతలను ఈ కొత్త బోర్డు పర్యవేక్షించనుంది. ఇందుకోసం జీవో నెంబర్ 128 విడుదల చేసింది. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ నూతన చైర్మన్ గా సీఎస్ రామకృష్ణరావును ప్రభుత్వం నియమించింది. సర్ఫరాజ్ అహ్మద్ ను ఎండీగా కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. డైరెక్టర్లుగా జయేశ్ రంజన్, వికాస్ రాజ్, సందీప్ కుమార్ సుల్తానియా, డీజీపీ శివధర్ రెడ్డి, సర్ఫరాజ్ అహ్మద్, అశోక్ రెడ్డి, జితేశ్ వి పాటిల్ ను నియమించింది. మేనేజింగ్ డైరెక్టర్ గా శివేంద్ర ప్రతాప్ ను నియమించింది. మెట్రోను మరింత లాభసాటిగా మార్చడం, రెండో దశ విస్తరణ పనులను వేగవంతం చేయడంపై కొత్త బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు దృష్టి సారించనున్నారు. మెట్రో నిర్వహణలో ఎల్ అండ్ టీ సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లు, రాయితీలకు సంబంధించిన వివాదాలకు ఈ నిర్ణయంతో తెరపడనుంది. ఈక్విటీ బదిలీ ద్వారా మెట్రోపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ లభించడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఎల్ అండ్ టీకి సంబంధించిన 15వేల కోట్ల రూపాయల వాటాను కొనుగోలు చేసేందుకు సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఐఎఫ్ఆర్ సీ నుంచి 13వేల 615 కోట్ల రూపాయలను ప్రభుత్వం రుణంగా తీసుకోనుంది. ఈ మొత్తాన్ని 20 ఏళ్ల కాల పరిమితిలో తిరిగి చెల్లించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పని చేస్తున్న పలువురు ఉద్యోగులను ఏడాది పాటు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ట్రో పగ్గాలను చేతుల్లోకి తీసుకున్నందున, పాలనా పరమైన సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ మెట్రో బోర్డును కొత్తగా పునర్వ్యవస్థీకరిస్తూ కీలక అధికారులను నియమించింది. మెట్రో బోర్డు చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావును ప్రభుత్వం నియమించింది. ఇన్నాళ్లూ ప్రైవేట్ యాజమాన్యం పర్యవేక్షణలో ఉన్న బోర్డు, ఇప్పుడు సీనియర్ ఐఏఎస్ అధికారుల కనుసన్నల్లో పనిచేయనుంది. బోర్డు డైరెక్టర్లుగా రాష్ట్రానికి చెందిన అత్యున్నత స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఐటీ , పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, వికాస్ రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిలను బోర్డు సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీస్ విభాగానికి చెందిన ఉన్నతాధికారిని బోర్డులోకి తీసుకోవడం ద్వారా మెట్రో భద్రత , శాంతిభద్రతల పరంగా కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వ ఈ నిర్ణయం వల్ల మెట్రో చార్జీల నియంత్రణ, రాయితీలు, భవిష్యత్తు పొడిగింపు పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉంది. ఎల్ అండ్ టీ సంస్థ మెట్రో కార్యకలాపాల నుంచి తప్పుకోవాలని భావిస్తున్న తరుణంలో, ప్రభుత్వం నేరుగా రంగంలోకి దిగి ప్రాజెక్టును హస్తగతం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామంతో గ్రేటర్ హైదరాబాద్ వాసులకు మరింత మెరుగైన రవాణా సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# బీఆర్ఎస్ పార్టీకి కొత్త కష్టాలు




హైదరాబాద్. : కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో కొత్త పార్టీని ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాఫిక్‌గా మారింది. గతంలోని ఉద్యమ పార్టీ టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌గా పేరు మార్చుకోవటం, ఆ సెంటిమెంట్ శూన్యాన్ని భర్తీ చేసేలా 'ఖీూ' అక్షరాలతోనే పార్టీని ప్రారంభించడం వ్యూహంలో భాగమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది కేవలం కొత్త పార్టీ స్థాపన మాత్రమే కాదని.. కేటీఆర్, హరీష్ నాయకత్వాన్ని ఆధిపత్యాన్ని వ్యతిరేకించే శ్రేణులకు ప్రత్యామ్నాయ వేదికగా బీఆర్ఎస్ ఓటు బ్యాంకును చీల్చే అడుగని అంటున్నారు. తెలంగాణలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పొలిటికల్ పార్టీని ప్రకటించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ రాష్ట్ర సేన పేరుతో పార్టీని ప్రకటించారు. గతంలో తన తండ్రి కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి పేరులోని అదే అక్షరాలు వచ్చేలా తెలంగాణ రాష్ట్ర సేన అని పేరు పెట్టడం వెనుక వ్యూహం దాగి ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది కేవలం ఒక పార్టీ స్థాపన మాత్రమే కాదని.. బీఆర్ఎస్ మూలాలను దెబ్బతీసే ఒక వ్యూహాత్మక అడుగుగా చెబుతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి దీనివల్ల ఎదురయ్యే ప్రధాన నష్టం సెంటిమెంట్ హ్యాకింగ్. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ప్రజల గుండెల్లో 'టీఆర్ఎస్' అనే పేరు బలంగా నాటుకుపోయింది. టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చిన తర్వాత ఆ పాత పేరుపై ఒక రకమైన శూన్యం ఏర్పడింది. ఇప్పుడు కవిత అదే పేరుతో పార్టీని పెట్టడం ద్వారా పాత ఉద్యమకారులను, తెలంగాణ వాదులను తన వైపు తిప్పుకునే అవకాశం ఏర్పడిందని అంటున్నారు. ఇక ఇవాళ పార్టీ ఆవిర్భావ సభలో కవిత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయిందని అందుకే తాను తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అంటే ప్రజల్లో ఉన్న తెలంగాణ సెంటిమెంట్‌ను తిరిగి రగిల్చేలా ఆమె వ్యూహాత్మకంగా టీఆర్ఎస్ పేరుతో పార్టీ పెట్టినట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇది బీఆర్ఎస్‌కు కష్టాలు తెచ్చిపెట్టే అవకాశం ఉంటుందని అంటున్నారు. దాంతో పాటు తెలంగాణ జాగృతి ద్వారా కవితకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో అనుచర వర్గం ఉంది. ఇన్నాళ్లూ బీఆర్ఎస్ కోసం పనిచేసిన ఈ శ్రేణులు ఇప్పుడు కొత్త పార్టీ వైపు చూసే ఛాన్స్ ఉందని... కేటీఆర్ నాయకత్వాన్ని వ్యతిరేకించే వారు లేదా బీఆర్ఎస్‌లో తగిన గుర్తింపు దక్కని ద్వితీయ శ్రేణి నాయకులకు ఇప్పుడు కవిత పార్టీ రూపంలో ఒక ప్రత్యామ్నాయ వేదిక దొరికినట్లయిందని అంటున్నారు. పార్టీ వ్యవస్థ లోపల ఇలాంటి చీలిక రావడం వల్ల ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలహీనపడటం ఖాయమని విశ్లేషిస్తున్నారు. మహిళా ఓటు బ్యాంకు విషయంలో బీఆర్ఎస్ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి రావచ్చునని అంటున్నారు. బతుకమ్మ ఉత్సవాలు, ఇతర కార్యక్రమాల ద్వారా మహిళలతో కవితకు ఉన్న అనుబంధం ఇప్పుడు ఓట్లుగా మారే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే ఒకే కుటుంబం నుంచి రెండు పార్టీలు, నాయకులు విడిపోవడం వల్ల.. ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీజేపీలకు అనుకూలంగా మారి బీఆర్ఎస్ గెలుపు అవకాశాలను సంక్లిష్టంగా మారుస్తుందని అంచనా వేస్తున్నారు. మొత్తంగా కవిత 'టీఆర్ఎస్' వ్యూహం ఏ మేరకు ఫలిస్తుందో వేచి చూడాలి మరి.

ముందున్న మాస్టర్ స్ట్రోక్: కవిత పార్టీకి గనుక కారును పోలిన గుర్తు కేటాయిస్తే.. బీఆర్ఎస్‌కు తీవ్ర నష్టం చేకూరుస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కవిత ఇప్పటికే టీఆర్ఎస్ పేరు ద్వారా బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టేందుకు ఎత్తు వేశారని.. ఒకవేళ ఆమెకు కేటాయించే గుర్తు కూడా కారు ఆకారంలోనో, దానికి దగ్గరగానో ఉంటే ఓటు బ్యాంకు చీలిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. బీఆర్ఎస్ పార్టీకి పడాల్సిన ఓట్లు, పొరపాటున కవిత పార్టీకి పడితే అది పరోక్షంగా కాంగ్రెస్ లేదా బీజేపీ వంటి ఇతర ప్రధాన పార్టీలకు లాభం చేకూరుస్తుందని చెబుతున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ కారు గుర్తును పోలిన గుర్తులపై బీఆర్ఎస్ ఈసీకి ఫిర్యాదు చేస్తూనే ఉందనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. తెలంగాణలో ఇప్పటికీ కారు, టీఆర్ఎస్ అంటే వేర్వేరు కావనే అభిప్రాయం ఉంది. ప్రజల మనసులో టీఆర్ఎస్ అంటేనే కారు గుర్తు అని బలంగా నాటుకుపోయి ఉంది. ఇప్పుడు కవిత ఖీూ పేరును తన సొంతం చేసుకున్నారు. రేపు ఎన్నికల గుర్తు కారును పోలేలా, ప్రజలను కన్ఫ్యూజ్ చేసేలా ఉంటే బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదం ఏర్పడవచ్చునని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇలా కవిత అసలు మాస్టర్ స్ట్రోక్ ముందుందని.. కారును పోలిన గుర్తును తెలంగాణ రాష్ట్ర సేనకు కేటాయిస్తే బీఆర్ఎస్‌కు కోలుకోలేని నష్టం తప్పదని అంటున్నారు

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం



ఇబ్రహీంపట్నం (తెలంగాణ వాణి విలేకరి): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం రైతు వేదికలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ని రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు.రానున్న వానాకాలం సీజన్ దృష్ట్యా పలు అంశాల పైన రైతులకి అవగహన కల్పించడం జరిగింది. సరియైన మోతాదులో యూరియా వాడకం, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం,మార్కెట్లో డిమాండ్ కలిగిన అధిక దిగుబడి పొందే వరి రకాల సాగు, మితంగా క్రిమిసంహారక రసాయనాల వినియోగం,సేంద్రియ వ్యవసాయం తదితర అంశాల పైన పొలాస వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి సౌజన్య అవగాహన కల్పించారు. మొక్కజొన్నలో మోతాదుకు మించి విచక్షణ రహితంగా ఏరియా వాడుతున్నారు అని ఎకరానికి మూడు నుంచి నాలుగు బస్తాలు మాత్రమే వాడాలి అని అలాగే నానో యూరియా వాడాలి అని అదేవిధంగా ఆయిల్ ఫామ్ సాగు రైతులకి లాభదాయకంగా ఉంటుందని రైతులు ఆయిల్ ఫామ్ సాగికి ముందుకు రావాలి అని కోరారు.ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి, సర్పంచ్ బద్దం గోపి,ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్,ఏఈఓ వినోద్,రైతులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్క పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్, ఏప్రిల్ 28:(తెలంగాణ వాణి ప్రతినిధి):రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క బుధవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో మంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో ఇంచార్జి మంత్రి పాల్గొననుండగా, కలెక్టర్ ఆడిటోరియంను సందర్శించారు. ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, డీఆర్డీఏ సాయన్న, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీడబ్ల్యూఓ పద్మ తదితరులు ఉన్నారు.

## రామోజీ పల్లెలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం..

మెదక్ జిల్లా ఏప్రిల్ 28:పెద్ద శంకరంపేట మండలం బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు రామోజీ పల్లి అంగన్వాడి కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలికల విద్య ప్రాముఖ్యత, చట్టపరమైన నిబంధనలు గురించి వివరించారు. చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల ఆరోగ్య సమస్యలు, విద్యలో అంతరాయం కలుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయశీల మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. ఉపసర్పంచ్ సంగమేశ్వర్, కార్యదర్శి వినోద్ కుమార్ కూడా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.అంగన్వాడి టీచర్ కవిత, ఎఫ్.ఏ. రాములు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కిశోర బాలికలు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..



# వాతావరణ సంక్షోభం వైపు భారత్

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. గంభీర పరిణామం
- ప్రకృతి హెచ్చరికలు..
- ప్రభుత్వాలు సమగ్ర విధానాలు, శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించాలి
- తక్షణ నివారణ చర్యలు అవసరం..
- సమాజ భాగస్వామ్యం అనివార్యం ..

మన దేశం బహుళ వాతావరణ సంక్షోభం అంచులపై ఉంది. గణాంకాలు, అనుభవాలు, రోజువారీ జరుగుతున్న సంఘటనలు ఈ వాస్తవాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఈ సంక్షోభం ఒక్కసారిగా ఉద్భవిం చింది కాదు, సంవత్సరాలుగా కూడబెట్టుకున్న పర్యావరణ నిర్లక్ష్యం, అభివృద్ధి నమూనాల్లోని అసమతుల్యతల ఫలితమే అన్నది చేదు నిజం. భారత వాతావరణ విభాగం ప్రకారం 2025 సంవత్సరం దేశ చరిత్రలో ఎనిమిదవ అత్యంత వేడిమి సంవత్సరంగా నమోదైంది. సగటు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.28శీజ అధికంగా నమోదయ్యాయి. ఈ సంఖ్య చిన్నదిగా కనిపించినా, వాతావరణ శాస్త్రంలో ఇది తీవ్రమైన మార్పులకు సంకేతం. ముఖ్యంగా 2016--2025 దశకం దేశ చరిత్రలోనే అత్యంత వేడి కాలంగా నిలవడం పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టంగా చూపుతోంది.

2026లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. మార్చి నెల నుంచే పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4శీజ నుంచి 8శీజ వరకు అధికంగా నమోదవుతున్నాయి. వసంత కాలం క్రమంగా క్షీణించి, వేసవి ముందుగానే దాడి చేస్తోందన్న నిపుణుల అభిప్రాయం దీనికి బలం చేకూరుస్తోంది.

2025 సంత్సరంలో దాదాపు 330కి పైగా రోజుల్లో దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట తీవ్రమైన వాతావరణ ఘటనలు నమోదయ్యాయి. తొలి తొమ్మిది నెలల్లో 99% రోజుల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం, ఈ పరిస్థితి ఎంత సాధారణంగా మారిందో తెలియజేస్తోంది. ఈ ఘటనల ఫలితంగా 4,000కు పైగా ప్రాణ నష్టం సంభవించగా, 94.7 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు నష్టపోవడం జరిగింది. లక్షకు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. వాతావరణ మార్పు అనేది ఒకే ఒక్క విపత్తుగా కాకుండా, నిరంతర సంక్షోభంగా మారిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉష్ణోగ్రతలలో తేడా.. పెరిగిన వడగాలుల తీవ్రత...: దేశంలో ఉష్ణోగ్రతల పెరుగుదలతో వడగాలుల తీవ్రత గణనీయంగా పెరిగింది. వాతావరణ విభాగం గణాంకాలను పరిశీలిస్తే 2015లో కేవలం 9 రాష్ట్రాల్లో నమోదైన వడగాలులు, 2020 నాటికి 23 రాష్ట్రాలకు విస్తరించాయన్నది విధితమవుతుంది. దేశంలో వడగాలుల రోజులు 7.4 నుంచి 32.2కు పెరిగాయి. ప్రతి సంవత్సరం 1,000 మందికి పైగా వడగాలుల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలోని సుమారు 57% జిల్లాలు తీవ్రమైన వేడి ప్రమాదంలో ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. తాజాగా శాస్త్రీయ విశ్లేషణలు కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మానవ శరీరం తట్టుకోలేని స్థాయికి చేరుతున్నాయని హెచ్చరిస్తున్నాయి. ఇది కేవలం పర్యావరణ సమస్య కాకుండా, ప్రజా ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా మారుతోంది.

వ్యవసాయ రంగం పై ప్రభావం...: వ్యవసాయం రంగం కూడా ఈ మార్పుల బారిన పడుతోంది. దేశ జనాభాలో 45% మంది వ్యవసాయంపై ఆధారపడుతున్నప్పటికీ, రుతుపవనాల అస్థిరత రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెడుతోంది. వర్షపాతం విషయానికొస్తే సమయపాలన లోపించడం, అధిక వర్షాలు పంటల వైఫల్యానికి దారి తీస్తున్నాయి. 2026లో మాన్సూన్ సాధారణం కంటే సుమారు 94% స్థాయిలోనే ఉండే అవకాశమున్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. ఇక 40% జిల్లాల్లో వరద ప్రాంతాలు క్రమంగా కరవు ప్రాంతాలుగా మారుతున్నాయి. ఇలాగే కొనసాగితే దీర్ఘకాల కరవు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది.

వేడెక్కుతున్న సముద్రాలు.. కరుగుతున్న హిమానీ నదాలు...: మన దేశం మూడు వైపులా ఉన్న సముద్రాలు వేడెక్కడం మరో ప్రధాన ఆందోళన. సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదలతో తుపానుల తీవ్రత పెరుగుతోంది. సముద్ర మట్టం పెరగడం వల్ల తీరప్రాంతాల్లో వరదలు అధికమవుతున్నాయి. 1995--2024 మధ్యకాలంలో ప్రపంచంలో అత్యధిక వాతావరణ ప్రభావిత దేశాల్లో భారత్ టాప్-10లో ఉండటం ఈ ప్రమాదం స్థాయిని తెలియజేస్తోంది. మరోవైపున హిమాలయాల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. హిమనీనదాల కరుగుదల వేగవంతమవుతోంది. దీని ఫలితంగా నదుల ప్రవాహం అస్థిరంగా మారే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో సాగునీటి కొరత, తాగునీటి సమస్యలు, వలసలు పెరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముంది. ఇటీవల హిమాలయ ప్రాంతాల్లో కూడా వడగాలుల ప్రభావం కనిపించడం కొత్త హెచ్చరికగా భావించాలి.

ప్రజల అనుభవాల్లోనూ...: వాతావరణ మార్పు ప్రభావం కేవలం గణాంకాల్లోనే గాక ప్రజల అనుభవాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని సర్వేలు చెబుతున్నట్లు దేశంలో 71% మంది తీవ్ర వడగాలులను అనుభవించగా, 52% మంది నీటి కొరతను ఎదుర్కొంటున్నారు, అలాగే 34% మంది వరదలను చూశారు. వాతావరణ మార్పు ఇప్పుడు ప్రజల రోజువారీ జీవితాల్లో ప్రత్యక్ష వాస్తవంగా మారింది.

తక్షణ చర్యలు అవసరం...: ఈ మొత్తం దృశ్యం ఒకే సందేశాన్ని ఇస్తోంది. వాతావరణ మార్పు భవిష్యత్తు సమస్య కాదు; ఇది ఇప్పటికే దేశాన్ని ప్రభావితం చేస్తున్న సంక్షోభం. ఉష్ణోగ్రతల పెరుగుదల వెనుక ఆర్థిక నష్టం, ఆహార భద్రత సమస్యలు, ఆరోగ్య సంక్షోభం, సామాజిక అసమానతలు అన్నీ దాగి ఉన్నాయి.

ఇప్పుడు మనముందున్నది ఒకే ప్రశ్న స్పందన ఎప్పుడు?. గణాంకాలు గట్టిగా హెచ్చరిస్తున్నప్పటికీ, చర్యలు ఆలస్యం అవుతూనే ఉన్నాయి. జాగ్రత్త పడాలి అనే దశను దాటి, తక్షణ చర్యలు తీసుకోవాలి అనే అత్యవసర దశకు దేశం చేరుకుంది.

వాతావరణ సంక్షోభం నుంచి బయటపడాలంటే ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు సమగ్ర విధానాలు, శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. పౌర సమాజం కూడా అందులో భాగస్వామ్యం కావాలి. లేకపోతే ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశమే లేని పరిస్థితులు సమీప భవిష్యత్తులోనే తలెత్తే ప్రమాదం లేకపోలేదు. ప్రకృతి ఇచ్చే హెచ్చరికలు మౌనంగానే ప్రారంభమైనప్పటికీ అవి విపత్తుల రూపంలో మారిపోతే అది వినాశనానికి దారితీస్తుందన్న విషయాన్ని గ్రహించి త్వరగా చేపట్టాలి.

ఉదయ్ కుమార్. జి
DAE, BA, BCJ, MCJ, LLB, MPhil., PhD
సీనియర్ జర్నలిస్టు
ఫోన్ నెంబర్ 8367603197

## రాయ సముద్రం చెరువును పరిశీలించిన సైబరా బాద్ కమిషనర్ శ్రీజన



పటాన్ చెరు (తెలంగాణ వాణి రిపోర్టర్) స్థానిక రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ విజ్ఞప్తి మేరకు ఈరోజు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన రామచంద్రపురం డివిజన్ లో ఉన్న రాయ సముద్రం చెరువు ను సందర్శించారు. గతంలో కార్పొరేటర్ గా ఉన్నపుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో ఎంతో కష్టపడి చెరువు సుందరీకరణ కొరకు హెచ్ఎండిఏ ద్వారా సుమారు 10.00 కోట్ల నిధులు మంజూరు చేయించగా, అలాగే అప్పటి జిహెచ్ఎంసి ద్వారా డ్రైనేజీ నీరు చెరువు లో కలవకుండా పైప్ లైన్ ద్వారా మళ్లింపు కొరకు 2.50 కోట్లు మంజూరు చెయ్యగా, పనులు ప్రారంభం చేస్తుంటే భెల్ యాజమాన్యం చెరువు తమదని, ఎలాంటి అభివృద్ధి కాని, ఎలాంటి చర్యలు కానీ, మీరు తీసుకోవద్దని పనులు జరుగ కుండా అడ్డుకున్నారు. ఇదే విషయం కమీషనర్ కి వివరించగా ఆమె ఈరోజు పర్యటించారు. వెంటనే సంబధిత ఇరిగేషన్, సీఎంసీ, భెల్ యాజమాన్యంతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పనులను త్వరగా చేపట్టే దిశగా అడుగులు వేయిస్తానని హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆలయాలు అభివృద్ధి

**గత ప్రభుత్వ కాలంలో ఆలయాన్ని పట్టించుకోని పాలకులు**
**అందరి సహకారంతో ధర్మపురి క్షేత్ర మాస్టర్ ప్లాన్ అమలు**
**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



జగిత్యాల(తెలంగాణ వాణి) :జగిత్యాల జిల్లా ధర్మపురి లోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రాన్ని గత ప్రభుత్వ పాలకులు ఏనాడు పట్టించుకోలేదనిరాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, దేవాదాయ శాఖ వైదిక సలహాదారు గోవిందుల హరి తో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మాస్టర్ ప్లాన్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఘనంగా శాలువాతో సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతు 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇందులో భాగంగా గోదావరి తీరం వెంట ఉన్న పలు ఆలయాలను అభివృద్ధి చేయాలని సిఎం నిర్ణయించారని మంత్రి వివరించారు. గోదావరి తీరంలో ఉన్న భద్రాచలం లోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం మాస్టర్ ప్లాన్, టెంపుల్ సిటీ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని మంత్రి వివరించారు. బాసరలోని సరస్వతి అమ్మవారు, కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ అమలుతో పాటు టెంపుల్ సిటీ నిర్మాణ పనులకు ప్రణాళికలు తయారు చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ తో పాటు పలువురు అధికారులు కలిసి మాస్టర్ ప్లాన్ అమలు తీరును పరిశీలించి, నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారని మంత్రి వివరించారు. ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి ప్రజల నుంచి సహకారం కావాలని మంత్రి కోరారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజల సహకారంతో ధర్మపురి క్షేత్ర మాస్టర్ ప్లాన్ అమలతో పాటు టెంపుల్ సిటీ నిర్మాణ పనులు చేస్తామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్, లక్ష్మి నరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు, ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అధికారులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి..

## సీఐటీయూ డిమాండ్



చిలిపిచెడ్, ఏప్రిల్ 28: మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికులకు గత 6 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం సరైనది కాదని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. మంగళవారం చిలిపిచేడ్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు సరైన వేతనం ఇవ్వడం లేదని.. ఇచ్చే వేతనం కూడా 6 నెలలుగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో కార్మికులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని తెలిపారు. కార్మికుల పనిగంటలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వారు తెలిపారు. 4 కొత్త లేబర్ చట్టాల అమలు కార్మికుల హక్కులను పెట్టుబడిదారులకు కట్టబెట్టడమే అవుతుందని అన్నారు. బ్రిటిష్ కాలం నుంచే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మికచట్టాలను తొలగించడం సిగ్గు చేటు అని విమర్శించారు. దేశం మొత్తం కరోనాతో అతలాకుతలమవుతున్న సమయంలో (2019, 2020)లో నాలుగు కొత్త లేబర్ చట్టాలను తీసుకురావడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో సంపన్నులు పెరిగారని.. నిరంతరం కష్టపడుతున్న కార్మికులు మాత్రం రోడ్డున పడే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. దేశవ్యాప్తంగా మే 1 నుంచి 7వ తేదీ వరకు మేడే వార్షికోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

## జిల్లాలో పెట్రోల్, డీజిల్ ఇంధనాల కొరత లేదు: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, ఏప్రిల్ : 28 ( తెలంగాణ వాణి ప్రతినిధి ): జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, ప్రజలకు అవసరమైన మేర నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు.

మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రుతో కలిసి చమురు కంపెనీల సేల్స్ అధికారులు, బంక్ డీలర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పెట్రోల్, డీజిల్ ఇంధన సరఫరా సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకున్నామని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రవాణా ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో పెట్రోల్ బంకుల వద్ద ఇంధన లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా బ్లాక్ మార్కెటింగ్ లేదా కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి నిల్వలను దాచిపెట్టి వినియోగదారులను ఇబ్బంది పెడితే, వారిపై నిత్యావసర వస్తువుల చట్టం కింద కఠినమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను లేదా పుకార్లను నమ్మి ప్రజలు భయాందోళనకు గురై బంకుల వద్ద రద్దీ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.అంతకుముందు చమురు కంపెనీ ప్రతినిధులతో నిర్వహించిన గూగుల్ మీట్‌లో, డిపోల నుండి బంకులకు చేరుతున్న సరఫరా తీరుపై కలెక్టర్ సమీక్షించారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నందిని, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు, జిల్లా పెట్రోల్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జున సరసన మరోసారి టబు





అక్కినేని నాగార్జున కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోనున్న 100వ చిత్రంలో సీనియర్ నటి టబు నటిస్తున్నారంటూ వస్తున్న వార్తలకు స్వయంగా ఆమే తెరదించారు. ఈ సినిమాలో తాను నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తన సోషల్ మీడియా ఖాతాలో మూవీ క్లాప్‌బోర్డు ఫొటోను షేర్ చేసి, ఊహాగానాలకు ముగింపు పలికారు. చిత్ర యూనిట్ అత్యంత గోప్యంగా చిత్రీకరణ జరుపుతుండగా, టబు పోస్ట్‌తో ఈ విషయం తొలిసారిగా బయటకు వచ్చింది. టబు పోస్ట్‌పై దర్శకుడు రా. కార్తీక్ స్పందిస్తూ, "మేడమ్, మీతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది" అని కామెంట్ చేశారు. 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో గతేడాది అక్టోబరులోనే ఈ సినిమా ప్రారంభమైంది. ప్రస్తుతం షూటింగ్ వేగంగా జరుగుతోంది. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నాగార్జున సరికొత్త లుక్‌లో కనిపించనున్నారని తెలుస్తోంది. దాదాపు 28 ఏళ్ల క్రితం 'నిన్నేపెళ్లాడతా' సినిమాతో నాగార్జున, టబుజంట టాలీవుడ్‌లో హిట్ పెయిర్‌గా నిలిచింది. ఆ తర్వాత 'ఆవిడా మా ఆవిడే'లోనూ కలిసి నటించారు. ఇంత సుదీర్ఘ విరామం తర్వాత ఈ జోడీ మళ్లీ తెరపై కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. అయితే, ఈ చిత్రంలో టబు నాగార్జునకు జోడీగా నటిస్తున్నారా లేక మరేదైనా కీలక పాత్ర పోషిస్తున్నా రా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు ఉంటారనే ప్రచారం కూడా జరుగుతోంది.

# సమంత బర్త్ డే .. రాజ్ సెలబ్రేషన్ పిక్స్ వైరల్





సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితంతో ఎప్పుడూ వార్తల్లో నిలిచే స్టార్ హీరోయిన్ సమంత మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఏప్రిల్ 28న ఆమె పుట్టినరోజు సందర్భంగా, ఆమె కు సంబంధించిన పలు విషయాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే 2023 లోనే సిటాడెల్ సిరీస్ షూటింగ్ సమయంలో సమంత భర్త రాజ్ నిడిమోరు ఆమె పుట్టిన రోజుని అర్ధరాత్రి ఘనంగా సెలబ్రేట్ చేయగా, ఈ పిక్స్ సమంత అప్పట్లో అధికారికంగానే పోస్ట్ చేసింది. ఆ సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తుందని రూమర్స్ రాగా ఈ ఫొటోలు మరింత బలం చేకూర్చాయి. ఎట్టకేలకి 2025 డిసెంబర్ లో రాజ్ – సమంత పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు వీరి పెళ్లి తర్వాత వచ్చిన సమంత మొదటి పుట్టిన రోజు కావడంతో ఈ ఫొటోలు వైరల్ గా మారాయి. మరో వైపుఏ బర్త్‌డేకు రెండు రోజుల ముందు షేర్ చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.'బర్త్‌డే వీక్' అంటూ సమంత తన జీవితంలో గత ఏడాది జరిగిన మార్పులను సూచిస్తూ కొన్ని ఫోటోలు పంచుకున్నారు. వాటికి జోడించిన వ్యాఖ్యలు అభిమానులను ఆలోచింపజేస్తున్నాయి. తనతో ఉన్నది ఏమిటి? వదిలేసింది ఏమిటి? జీవిత ప్రయాణంలో పోయినవి, మిగిలినవి ఏవో ఆమె చాలా సూటిగా వెల్లడించారు.తన ప్రయాణం ప్రారంభం గురించి చెబుతూ... పని మీద ప్రేమ, ముందుకు నడిపించే ఆత్మవిశ్వాసమే ఇప్పటికీ తన బలం అని సమంత పేర్కొన్నారు. అయితే ఎప్పుడూ ఇతరుల ఎంపిక కోసం ఎదురుచూసే స్వభావాన్ని మాత్రం వదిలేశానని తెలిపారు. జీవితంలో ప్రతీది ప్లాన్ ప్రకారం జరగకపోయినా, తన మనసు చెప్పేది వినే తీరు మారలేదని చెప్పారు. కానీ తనను నియంత్రించాలనే ఆలోచనను మాత్రం విడిచిపెట్టినట్లు వెల్లడించారు. ప్రతిదీ మారినా నా సంకల్పం మారలేదు అని సమంత చెప్పడం గమనార్హం. తాను ఎలా ఉండాలని అనుకున్నానో ఆ భావనను కూడా ఇప్పుడు వదిలేశానని చెప్పడం ద్వారా, గతంలో జరిగిన వ్యక్తిగత పరిణామాలను సూచించినట్టుగా అనిపిస్తోంది. ప్రస్తుతం తన జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యం ఉందని, తొందరపడే స్వభావాన్ని కూడా వదిలేశానని సమంత చెప్పారు. ప్రతి ఫోటో వెనుక ఒక లోతైన భావం దాగి ఉందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

# హైకోర్టును ఆశ్రయించిన అషురెడ్డి



పెళ్లి పేరుతో తనను, తన కుటుంబాన్ని నమ్మించి, దాదాపు రూ. 9.83 కోట్లు మోసం చేసిందంటూ బాధితుడు ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో నటి అషురెడ్డి పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. పెళ్లి సాకుతో అషురెడ్డి తన వద్ద నుంచి సుమారు రూ. 9.83 కోట్లు వసూలు చేసిందని ధర్మేంద్ర ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా, ఆమె సోదరి దివ్యారెడ్డికి కూడా రూ. 50 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లికి అన్ని సిద్ధమవుతున్న తరుణంలో అషురెడ్డి అకస్మాత్తుగా ధర్మేంద్రను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ అషురెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై వస్తున్న ఆరోపణలను అషురెడ్డి తోసిపుచ్చారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కనీసం తన వెర్షన్ వినకుండానే పోలీసులు ఏకపక్షంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులో వాస్తవం లేదని, కాబట్టి ఆ ఎఫ్ఐఆర్ ను వెంటనే కొట్టివేయాలని కోర్టును కోరారు. ఈ కేసు ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో ఉంది. రెండు నెలల క్రితమే ఫిర్యాదు చేసినా, ఇప్పుడు ఈ వ్యవహారం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అషురెడ్డి పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సినిమా

# పెద్ది ఐటెం సాంగ్ లీక్..

## చరణ్‌తో కాలు కదిపేది ఎవరో తెలిసిపోయింది..




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'పై రోజురోజుకు హైప్ పెరుగుతోంది. మొదట ఈ సినిమాను ఏప్రిల్ 30న విడుదల చేయాలని ప్లాన్ చేసినప్పటికీ, కొన్ని కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని జూన్ 25న విడుదల చేయాలని నిర్ణయించినట్టు దర్శకుడు బుచ్చిబాబు ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో వెల్లడించారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ముఖ్యంగా ఒక మాస్ ఐటెమ్ సాంగ్ చిత్రీకరణ జరుగుతున్న సమయంలో, షూటింగ్ స్పాట్ నుంచి ఓ వీడియో లీక్ కావడం ఆసక్తికరంగా మారింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. లీక్ అయిన వీడియోలో శృతి హాసన్, రామ్ చరణ్ కలిసి మాస్ స్టెప్పులతో అదరగొడుతున్నట్టు కనిపిస్తున్నారు. చరణ్ తన ఎనర్జీ, స్టైల్‌తో డ్యాన్స్ చేస్తుంటే, శృతి హాసన్ కూడా అతనికి తగ్గట్టే స్టెప్పులు వేస్తూ ఆకట్టుకుంటోంది. ఈ జంటను మళ్లీ తెరపై చూడబోతున్నారనే వార్త అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచింది. ఎవడు సినిమా తర్వాత రామ్ చరణ్, శృతి హాసన్ జంటగా కనిపించడం ఇదే మొదటిసారి కావడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమాను ఉత్తరాంధ్ర ప్రాంతం నేపథ్యంగా పీరియడ్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ మాస్ లుక్‌లో కనిపించనున్నాడు. కథాపరంగా కూడా ఈ సినిమా విభిన్నంగా ఉండనుందని సమాచారం. చరణ్ ఇందులో కేవలం క్రికెట్ ప్లేయర్‌గా మాత్రమే కాకుండా కుస్తీ ఫైటర్‌గా కూడా కనిపించనున్నాడని టాక్ వినిపిస్తోంది. ఈ అంశం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. ఇక ఈ ఐటెమ్ సాంగ్‌కు సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ మాస్ బీట్ అందించినట్టు సమాచారం. లీక్ వీడియోలో వినిపిస్తున్న సంగీతం, డ్యాన్స్ మూమెంట్స్ ఇప్పటికే అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. 'పెద్ది' సినిమా షూటింగ్ నుంచి లీక్ అయిన ఈ వీడియో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతూ, చిత్రంపై అంచనాలను మరింత పెంచుతోంది. విడుదల తేదీ సమీపిస్తున్న కొద్దీ మరిన్ని అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పిల్లల్ని కనడానికి.. పెళ్లికి ఏం సంబంధం



గ్లామర్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన ఇమేజ్‌ను క్రియేట్ చేసుకున్న నటి నిత్యామీనన్. నటనలో జీవించడమే తప్ప, కృత్రిమమైన హొయలు పోవడం ఆమెకు అస్సలు తెలియదు. అందుకే ఆమె చేసే సినిమాలు ఎంత డిఫరెంట్‌గా ఉంటాయో, ఆమె ఇచ్చే స్టేట్‌మెంట్స్ కూడా అంతే పవర్‌ఫుల్‌గా ఉంటాయి. తాజాగా పెళ్లి, పిల్లల విషయంలో నిత్యా చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. సాంప్రదాయాలకు, సామాజిక కట్టుబాట్లకు భిన్నంగా ఆమె వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. చైల్డ్ ఆర్టిస్ట్‌గానే వెండితెరకు పరిచయమై, తెలుగులోకి రాకముందే దాదాపు ఎనిమిది సినిమాల్లో నటించి మెప్పించింది ఈ మలయాళ ముద్దుగుమ్మ. అలా మొదలైంది సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి, మొదటి చిత్రంతోనే కుర్రకారు గుండెల్లో గంటలు కొట్టేసింది. కెరీర్ ఆరంభం నుంచి గ్లామర్ పాత్రల కంటే, నటనకు ప్రాధాన్యం ఉన్న క్యారెక్టర్ ఓరియెంటెడ్ రోల్స్‌నే ఎంచుకుంటూ స్లో అండ్ స్టడీగా దూసుకుపోతోంది. ఆమె స్క్రీన్ మీద ఉంటే ఆ కళే వేరు. అయితే తాజాగా ఒక ఇంటర్వ్యూలో నిత్యా మాట్లాడిన మాటలు వింటే.. ఆమె ఎంత బోల్డ్ అండ్ క్లారిటీ ఉన్న పర్సనో అర్థమవుతుంది. సినిమాలు తగ్గిన టైంలో సాధారణంగా హీరోయిన్లకు పెళ్లి ఎప్పుడు అనే ప్రశ్న ఎదురైతే ఏదో ఒక సమాధానం చెప్పి దాటవేస్తుంటారు. కానీ నిత్యా మాత్రం ఈ విషయాన్ని చాలా లోతుగా విశ్లేషించింది. పిల్లల్ని కనడానికి పెళ్లితో సంబంధం లేదని ఆమె అభిప్రాయ పడటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పిల్లలు కావాలనుకోవడం అనేది పూర్తిగా ఒక వ్యక్తిగత నిర్ణయమని, దానికి వివాహం ఒక్కటే మార్గం కాదని ఆమె కుండబద్దలు కొట్టారు. ఒక ప్రాణానికి జన్మనివ్వాలనే కోరికను సామాజిక హోదాతో లేదా పెళ్లి అనే ముడితో కలపాల్సిన అవసరం లేదని చెప్పడం ఆమె ధైర్యానికి నిదర్శనం. ప్రతి ఒక్కరూ గుర్తించేలా ఆమె తన వ్యక్తిగత స్వేచ్ఛ గురించి గళం విప్పింది. పెళ్లి గురించి మాట్లాడుతూ.. ప్రస్తుతం తనపై ఎలాంటి కుటుంబ ఒత్తిడి లేదని, సోలో లైఫ్‌ను తాను పూర్తిస్థాయిలో ఎంజాయ్ చేస్తున్నానని నిత్యా వెల్లడించింది. పెళ్లి అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే అని, దానివల్ల కెరీర్ ముగిసిపోదని ఆమె నమ్ముతోంది. సమాజం ఏమనుకుంటుంది అనే దానికంటే, తన మనసుకి ఏది సరైనది అనిపిస్తుందో అదే చేస్తానని నిత్యా చెప్పిన మాటలు యువతలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ప్రస్తుతం సినిమాలు అలాగే వెబ్ సిరీస్‌లతో ఫుల్ బిజీగా ఉన్న ఈ భామ, తనకంటూ కొన్ని స్పష్టమైన హద్దులను గీసుకుని ముందుకు సాగుతోంది. నిత్యామీనన్ చేసిన ఈ వ్యాఖ్యలు కొంతమందికి వివాదాస్పదంగా అనిపించినా, మరికొంతమంది మాత్రం ఆమెలోని నిజాయితీని మెచ్చుకుంటున్నారు. ఏది ఏమైనా నిత్యా ఎప్పుడూ ట్రెండ్‌ను ఫాలో అవ్వదు.. ట్రెండ్‌ను సెట్ చేస్తుంది.

## వినాశకాలే విపరీత బుద్ధి అని

# పెద్దలు ఊరికే అనలేదు

**- పెట్రోల్ బంక్‌లో యువకుల బైక్ స్టంట్‌పై సీపీ సజ్జనార్ ఆగ్రహం**

**- అమ్మాయిలను ఇంప్రెస్ చేసేందుకు చేసిన విన్యాసం వికటించిన వీడియో వైరల్**

**- బాధ్యతగా మెలగాలని యువతకు సజ్జనార్ సూచన**



హైదరాబాద్, : యువత రోడ్లపై చేసే ప్రమాదకర బైక్ విన్యాసాలపై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మరోసారి తీవ్రంగా స్పందించారు. పెట్రోల్ బంక్ లాంటి అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంలో కొందరు యువకులు చేసిన బైక్ స్టంట్‌కు సంబంధించిన వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేస్తూ, యువతకు ఆయన గట్టిగా హితవు పలికారు. వివరాల్లోకి వెళితే, ఓ పెట్రోల్ బంకు వద్ద అమ్మాయిలను చూసి ఇద్దరు యువకులు బైక్‌పై వీలింగ్ చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఆ స్టంట్ వికటించి మరో బైక్ ను ఢీకొట్టారు. దీంతో అక్కడున్న వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, ఓ వ్యక్తి ఆ యువకుడిపై చేయి కూడా చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఈ వీడియోను పంచుకుంటూ సజ్జనార్ తనదైన శైలిలో స్పందించారు. “వినాశకాలే విపరీత బుద్ధి అని పెద్దలు ఊరికే అనలేదు. పెట్రోల్ బంక్ లాంటి అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంలో అమ్మాయిలను ఇంప్రెస్ చేయడానికి బైక్ స్టంట్లు చేయడం సాహసం కాదు.. అది పచ్చి మూర్ఖత్వం! మీ ఒక్క క్షణపు షో కోసం అక్కడ ఉన్న అమాయకుల ప్రాణాలు బలి కావాలా!? గుర్తుంచుకోండి.. మీరు చేసే వీలింగ్స్ ఇంట్లో మీ కోసం ఎదురుచూసే తల్లిదండ్రుల కళ్లలో కన్నీటి ఫీలింగ్స్ మిగల్చకూడదు. బాధ్యతగా ఉండండి” అని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. క్షణికావేశంలో చేసే పనులతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని యువతకు సూచించారు.

# కేసీఆర్ ఫీల్డ్ ప్లాన్



హైదరాబాద్, : అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. ఇక స్పీడ్ పెంచాల్సిందే. ఇటు అధికార కాంగ్రెస్‌ను..ఇటు కవిత పార్టీని టార్గెట్ చేస్తూ దూకుడు పెంచాల్సిందేనని డిసైడ్ అయిందట గులాబీపార్టీ. గ్రామ స్థాయి నుంచిరాష్ట్ర స్థాయి వరకు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని గులాబీ బాస్ డిసైడ్ చేశారట. కేసీఆర్ కీలక నిర్ణయాలు ప్రకటించబోతున్నారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీ పేరును టీఆర్ఎస్‌గా మార్చాలన్న డిమాండ్ నేపథ్యంలో ఊహించని మార్పులు ఉండొచ్చని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక పోరుబాటే అంటోంది బీఆర్ఎస్. ఇప్పటికే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తుండటంతో..ఇంక స్పీడును పెంచేందుకు సమూల మార్పులకు సిద్ధమవుతోంది. పార్టీ అధినేత కేసీఆర్ హాజరు కానున్న ఈ మీటింగ్ చాలా కీలకమైందిగా చెబుతున్నారు. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బిగ్ డెసిషన్స్ తీసుకోబోతున్నారన్న టాక్ నడుస్తోంది. పార్టీ పేరు టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారిన తర్వాత పార్టీ సంస్థాగతనిర్మాణంపై అధినేత కేసీఆర్ పూర్తిగా దృష్టి పెట్టలేదు. చాలా కాలంగా పార్టీ కమిటీల ఏర్పాటు పూర్తిస్థాయిలో జరగలేదు. 2022లో ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీగా మార్చిన కేసీఆర్ వెంటనే అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత పార్లమెంటు ఎలక్షన్స్ బిజీలో ఉండి పోయారు. దీంతో కమిటీల నియామకం ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. ఇప్పుడు ఎన్నికలకు ఇంకా రెండేళ్ల టైమ్ మాత్రమే ఉండటంతో..పార్టీ బలోపేతంపై కేసీఆర్ సీరియస్ ఫోకస్ చేసినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం పార్టీకి జిల్లా అధ్యక్షులతో పాటు రాష్ట్ర స్థాయిలో కొంత మంది ప్రధాన కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. దీంతో కొత్త కమిటీల నియామకం తప్పనిసరని భావిస్తున్నారట. రెండు మూడు నెలల్లో కచ్చితంగా కమిటీలన్నీ నియమించాలన్న ప్లానింగ్‌లో ఉన్నారట. సభ్యత్వ నమోదు తర్వాత పూర్తిస్థాయిలో కమిటీల ఏర్పాటుపై ఫోకస్ చేస్తారట. ఇక పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చిన తర్వాత వరుసగా అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలవడంతో..నెగెటివ్ సెంటిమెంట్‌గా ఫీల్ అవుతున్నారట. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారిన తర్వాతే పార్టీ అధికారం కోల్పోయిందని, నేతల చుట్టూ కేసులు విచారణలు అంటూ కష్టాలు మొదలయ్యాయనే చర్చ పార్టీలో ఉంది. ఈ నేపథ్యంలో పార్టీ పేరును మళ్లీ బీఆర్ఎస్ నుంచి టీఆర్ఎస్‌గా మార్చాలన్న డిమాండ్ పెరుగుతూ వస్తోంది. దీంతో పార్టీ పేరు మార్పుపై బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఢిల్లీలో న్యాయ నిపుణులతో చర్చించినట్లు తెలుస్తోంది. పార్టీ కీలక సమావేశంలో పార్టీ పేరు మార్పుపై కేసీఆర్ కీలక ప్రకటన చేసే అవకాశం ఉందంటున్నారు. ఇక కవిత పార్టీ ఏర్పాటు..టీఆర్ఎస్ పేరు..ఈ అంశాలపై కేసీఆర్ రియాక్ట్ అవుతారా లేదా అన్నది కూడా ఇంట్రెస్టింగ్‌గా మారింది. కవిత నేరుగా కేసీఆర్‌నే టార్గెట్ చేయడంతో.. క్యాడర్, లీడర్లలో కాన్ఫిడెన్స్ నింపేందుకు గులాబీ బాస్ స్పందిస్తారా? ఎప్పటిలాగే లైట్ తీసుకుంటారా అనేది చూడాలి.

## సంక్షేమ పథకాల ప్రచారంలో..

# సమాచార శాఖను తీర్చిదిద్దాలి





హైదరాబాద్ (తెలంగాణ వాణి) ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలంటే సమాచార పౌర సంబంధాల శాఖ తన ప్రచార శైలిని మరింత ఆధునీకరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారగోని పురుషోత్తం అన్నారు. ఐ అండ్ పీఆర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముకుంద రెడ్డిని మంగళవారం డాక్టర్ బిఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టీఎస్జేయూ ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సందర్భంగా నారగోని పురుషోత్తం మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సమాచార శాఖది కీలక పాత్ర అని నొక్కి చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి, ప్రచార విభాగాలను బలోపేతం చేయడం ద్వారా పథకాల లబ్ధిని ప్రజలకు మరింత చేరువ చేయవచ్చని ఆయన ఆకాంక్షించారు. అనుభవజ్ఞులైన ముకుంద రెడ్డి నేతృత్వంలో శాఖ కొత్త పుంతలు తొక్కుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అదేవిధంగా జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారంపై కూడా కమిషనర్ సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ముత్యం ముఖేష్ గౌడ్ తదితరులు పాల్గొని కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు.

# నీట్ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



జయశంకర్ భూపాలపల్లి (తెలంగాణ వాణి): జాతీయ స్థాయిలో ఎంతో ప్రాధాన్యత కలిగిన నీట్ పరీక్షను జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. నీట్ పరీక్ష నిర్వహణపై ఐడిఓసి కార్యాలయంలో పోలీస్, విద్యా, రవాణా, వైద్య, అగ్నిమాపక శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మే 3వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలల్లో రెండు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 374 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని డిగ్రీ కళాశాలలో 240 మంది, జూనియర్ కళాశాలలో 134 మంది హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటు చేయబడినదని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అధికారులకు కేటాయించిన విధులపై దిశానిర్దేశం చేశారు. పోలీస్ శాఖ ద్వారా పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలని 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. ప్రశ్న, జవాబు పత్రాలను క్లోస్డ్ వాహనంలో పోలీస్ భద్రత మధ్య తరలించాలని సూచించారు. వైద్య శాఖ ద్వారా ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స, అంబులెన్స్ సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అగ్నిమాపక శాఖ ద్వారా అత్యవసర పరిస్థితులలో సేవలు అందించేందుకు అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పరీక్షల రోజున అభ్యర్థులకు రాకపోకల సౌకర్యార్థం టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని తెలిపారు. అలాగే విద్యుత్ శాఖ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని తెలిపారు. మున్సిపల్ శాఖ ద్వారా తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అభ్యర్థులు రెండు పాస్ ఫోటోలు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు పరీక్ష రోజున మూసివేయాలని తెలిపారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు ఉదయం 11 గంటల నుండి అనుమతి ఇస్తారని ముందుగా చేరుకుని, నిబంధనలు పాటించాలని సూచించారు. జిల్లాలో నీట్ 2026 పరీక్షలను ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఎస్పీ సంపత్ రావు, రవాణా అధికారి సంధాని, డీఈఓ రాజేందర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, నోడల్ అధికారి డా రమణా రావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసులు, వైద్య, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా.. చదువుకు దగ్గరగా ఉండాలి: కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, ఏప్రిల్ : 28 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) : బాలల రక్షణ, వారి ఉజ్వల భవిష్యత్తును కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ‘ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక’ 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా టీనేజ్ గర్భాల నివారణ, ఎలోప్‌మెంట్, డ్రగ్స్ నివారణ పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువత “డ్రగ్స్‌కు దూరంగా - చదువుకు దగ్గరగా” ఉంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టీనేజ్ గర్భాలు, బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటుందని, ఇలాంటి అనర్థాలపై గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు ప్రేమ వ్యవహారాలు, కేసుల బారిన పడకుండా పాఠశాలల్లో ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆపదలో ఉన్న బాలల కోసం 24 గంటలూ అందుబాటులో ఉండే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని కోరారు.

అనంతరం ఇంటర్మీడియేట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కలెక్టర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, రిమ్స్ డైరెక్టర్.డా.జైసింగ్ రాథోడ్, డా. సాధన,ప్రిన్సిపల్ లలిత, ఇతర అధికారులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# 3 గ్రామపంచాయతీ లతో గ్రామ సభ ఏర్పాటు చేయాలి

**సింగరేణి ప్రాంతం కావడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు**

**అన్ని వర్గాల ప్రజలతో సమావేశం ఏర్పాటు చేయాలి**

**ఎంపీడీవో కి వినతి పత్రం అందించిన “గూడెల్లి యాకయ్య”**



కొత్తగూడెం (తెలంగాణ వాణి): చుంచుపల్లి మండల పరిధిలోని రుద్రంపూర్, గౌతమ్ పూర్, ధన్బాద్ గ్రామపంచాయతీలలో నివసిస్తున్న అన్ని వర్గాల ప్రజలతో గ్రామసభ నిర్వహించాలని మదర్ తెరిసా సేవా సంస్థ సభ్యులు కోరారు. మంగళవారం ఈ మేరకు చుంచుపల్లి ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు. విశ్వమాత మదర్ తెరిసా సేవా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో రుద్రంపూర్ లో గల అన్ని రాజకీయ పార్టీలతో పాటు అన్ని వర్గాలు, కుల మతాలకతీతంగా ఇంటింటికి తిరిగి సంతకాలసేకరణ చేయడం జరిగింది. అంతేగాకఆయా ప్రాంతాల ముఖ్యులు,మసీదు కమిటీ, చర్చి కమిటీ, ఆలయ కమిటీ, తాపీ సంఘము, ఆటో సంఘము వ్యాపార వర్గాల ప్రజలు సీనియర్ సిటిజన్స్ , మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఇంటింటికి తిరిగి 200 మంది సంతకాలతొ రుద్రంపూర్లో ప్రత్యేకమైన గ్రామ సభ జరుపలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. రుద్రంపూర్ గ్రామ పంచాయతీ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు కూడా ప్రభుత్వానికి సంబంధించిన ఇందిరమ్మ ఇల్లు గాని, డబుల్ బెడ్ రూమ్ ఇల్లులు ఎలాంటివి కూడా నోచుకున్న పాపాన పోలేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతేగాక ఇండిపెండెంట్గా నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నెంబర్లు ఇవ్వడం లేదని ఇక్కడి ప్రజలందరూ వాపోతున్నట్లు తెలిపారు. తా మందరం సింగరేణి దయ వల్ల సింగరేణి ప్రాంతంలో నివసిస్తున్నామని, ముందు ముందు సింగరేణి వారు ఈ ప్రాంతమును ఖాళీ చేసినట్లయితే రుద్రంపూర్ గ్రామపంచాయతీ పరిస్థితి ఏమిటని ఆ వినతిపత్రంలో ప్రశ్నించారు. అలాగే తామందరం ఎక్కడికి వెళ్లాలని సంబంధిత ఎంపీడీవో కి కోరినట్లు తెలిపారు. అయితే రుద్రంపూర్ గౌతంపూర్ ధనుబాద్ మూడు గ్రామ పంచాతిలకు కలిపి మెగా ప్రత్యేకమైన గ్రామ సభ నిర్వచించాలనికోరడం జరిగింది. ఈ యొక్క గ్రామ సభకు ఎమ్మెల్యే, చుంచుపల్లి ఎమ్మార్వో, డీపీవో, స్థానిక 2టౌన్ పోలీస్శాఖ, సింగరేణి జనరల్ మేనేజర్, రాజకీయ నాయకులను, యూనియన్ నాయకులను, ప్రజాప్రతినిధులను, గుడి, మజీదు ,చర్చి కమిటీలను, కులసంఘాలను, వృత్తి సంఘాలను, ఆటో యూనియన్, తాపీ యూనియన్, మహిళ సంఘాలు, స్వచంద సంగా లను వ్యాపార సంఘాలను , గ్రామ సభకు ఆహ్వానించాలనుకున్నామని పేర్కొన్నారు. గ్రామసభలో ప్రజానీకం వారి బాదలను అధికారులకు వినవించుకునే వెసులుబాటు కల్పించామని ఆ వినతిపత్రంలో వివరించారు. ఈ గ్రామ సభలో అందరికి ఆమోదయోగ్యమైన తీర్మానం చేయించాలని, తద్వారా ప్రజలకు మేలు కలిగే విధంగా చూడాలని కోరడం జరిగిందని సంస్థ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో సేవా ప్రెసిడెంట్ గూడెల్లి యాకయ్య, బోట్ల ప్రభాకర్, చింతల రాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# జనన గణన విధులు సక్రమంగా నిర్వహించాలి

## తూము రవీందర్ పటేల్



పెద్దపల్లి /అంతర్గాం (తెలంగాణ వాణి): జనన గణన విధులు సక్రమంగా నిర్వహించాలి అని అంతర్గాం తహిసిల్దార్ తూము రవీందర్ పటేల్ అన్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలో జనగణన నమోదు ప్రక్రియపై ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఎన్టీపీసీ, మిలీనియం హాల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాకు చెందిన మాస్టర్ ట్రైనర్లు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు జనగణన విధానంపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ శిక్షణలో అధికారులు ప్రాక్టికల్ విధానాలతో పాటు ఆన్‌లైన్ డేటా నమోదు పద్ధతులను వివరిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా అంతర్గాం తహశీల్దార్ తూము రవీందర్ పటేల్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా జనగణన పరిపాలన సౌలభ్యానికి కీలకమని అన్నారు. 2021లో నిర్వహించాల్సిన జనగణన కోవిడ్ కారణంగా వాయిదా పడిందని... ఈ సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనగణన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో జనగణన నిర్వహణకు సంబంధించి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్క అంతర్గాం మండలంలోనే యాభైకి పైగా అధికారులు జనగణనలో పాల్గొని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వివరాలను అధికారులకు అందించాలని ఆయన సూచించారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar
MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com